

ఆంధ్రజ్యోతి



కర్నూలు
జిల్లా వార్తలు 5
సోమవారం 17 మార్చి 2025



రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరి
	సోమవారం	మంగళవారం
కర్నూలు	6:31	5:12
నంద్యాల	6:27	5:11

నీళ్లివ్వండి.. మహాప్రభో..!

సర్వసభ్య సమావేశంలో జడ్పీటీసీల ఆందోళన

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

-మంత్రి టీజీ భరత్



జిల్లా పరిషత్ సమావేశానికి హాజరైన జడ్పీటీసీ సభ్యులు, ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి

కర్నూలు న్యూసిటీ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): నీళ్లివ్వండి మహాప్రభో అంటూ జడ్పీటీసీలు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన గ్రామీణ నీటి సరఫరా-పారిశుద్ధ్యం, వ్యవసాయ శాఖ, జలవనరుల శాఖ అంశాలపై సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రితో పాటు కర్నూలు, నంద్యాల జిల్లా కలెక్టర్లు పి.రంజిత్‌బాషా, రాజకుమారి గణియా, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం, ఆలూరు, నందికొట్కూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, వీరుపాక్షి, జయసూర్య, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, ఉమ్మడి జిల్లాల జడ్పీటీసీలు, అధికారులు హాజరయ్యారు. ముందుగా పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మంత్రి టీజీ భరత్, అధికారులు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల మృతిచెందిన ప్యాపిలి జడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామ్‌రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సభ్యులంతా నీటి సమస్యపైనే ఎక్కువగా గళం విప్పారు. మద్దికెర, ఓర్వకల్లు, కొత్తపల్లి, వెల్దుర్తి, ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, కోడుమూరు, జూపాడుబంగ్లా, నంద్యాల మండలాల్లో తీవ్ర నీటి ఎద్దడి ఉందని, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని సమస్యను పరిష్కరించాలని అన్నారు. నంద్యాల మండలంలోని పది గ్రామాల్లో నీటి సమస్య ఉందని ఎంపీపీ, గోస్పాడు మండలంలో రెండు గ్రామాలలో నీటి సమస్య ఉందని, పగిడ్యాలలో చేతి పంపులకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. జడ్పీటీసీ దివ్య వెల్దుర్తి మండల కేంద్రానికి తాగునీటి పరిష్కారం కోసం బ్రహ్మగుండం నుంచి మరో పైప్‌లైన్ వేయాలని జడ్పీటీసీ సుంకన్న, కొత్తపల్లి మండలం బాపురం, లింగాపురం గ్రామాల్లో నీటి వృథాను అరికట్టాలని, చేతి పంపులు రిపేరీ చేయాలని విన్నవించారు. మంత్రి టీజీ భరత్ స్పందిస్తూ ఉమ్మడి జిల్లాలో వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజిత్ బాషా, జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, ఎమ్మెల్యే విరూపాక్షి

-మిగతా 7లో...

నకిలీ వెబ్‌సైట్లను నమ్మొద్దు : శ్రీశైలం ఈఓ



మాట్లాడుతున్న ఎం.శ్రీనివాసరావు

శ్రీశైలం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): నకిలీ వెబ్‌సైట్లను నమ్మొద్దని శ్రీశైలం దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు అన్నారు. శ్రీశైలం దేవస్థానం వసతి గదులు, ఆర్జిత సేవలు, దర్శనం టికెట్లు ముందస్తుగా పొందేందుకు దేవస్థానం ఆన్‌లైన్ విధానాన్ని రూపొందించిందని దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శ్రీశైలం దేవస్థానం పేరుతో కొందరు సైబర్ నేరగాళ్లు నకిలీ వెబ్‌సైట్లు తయారు చేసి సొమ్ము చేసుకుంటున్నారని, భక్తులు అలాంటి వెబ్‌సైట్లను నమ్మవద్దని సూచించారు. శ్రీశైలం దేవస్థానం వసతి గదులు, ఆర్జిత సేవా టికెట్లు స్వామివారి స్పర్శ దర్శనం టికెట్లు, శీఘ్ర దర్శనం, అతి శీఘ్ర దర్శనం టికెట్లు ఆన్‌లైన్‌లో పొందేందుకు భక్తులు దేవస్థానం అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.శ్రీశైలందేవస్థానం.ఓఆర్‌జి లేదా దేవదాయశాఖ అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీటెంపుల్స్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లను మాత్రమే వినియోగించ వలసిందిగా దేవస్థానం ఈవో తెలిపారు. దేవస్థానం, దేవదాయశాఖ వెబ్‌సైట్ కాకుండా భక్తులు మరే ఇతర నకిలీ వెబ్‌సైట్లను నమ్మి మోసపోవద్దని, మరిన్ని వివరాలకు దేవస్థానం సమాచార కేంద్రం ఫోన్ నంబర్లు 8333901351/52/53 సంప్రదించాలని ఈవో ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

వీఆర్వోల సమస్యలను పరిష్కరించాలి

కర్నూలు కలెక్టరేట్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు మౌలిబాషా డిమాండ్ చేశారు. ఆదివారం ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. తమ సమస్యలను పరిష్కరించాకే పదోన్నతులు ఇచ్చి, రేషనలైజేషన్ చేయాలన్నారు. ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులను అర్హులైన వీఆర్వోల చేత భర్తీ చేయాలన్నారు. ప్రతి సచివాలయానికి ఒక వీఆర్వోను కేటాయించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సర్పరాజు, ఉపాధ్యక్షుడు అల్లాబకాష్, కోశాధికారి శ్రీధర్, తిరుమల్ రెడ్డి, నారాయణ రెడ్డి, బుద్ధకవి, ఖాజా హుశేన్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితులు..?

- టీడీపీ నేత హత్య కేసులో పురోగతి
- నిందితులను పట్టించిన ఫోన్ కాల్
- ఎస్పీ సీరియస్‌తో జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



మృతుడు సంజన్న (ఫైల్)

కర్నూలు క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు సంజన్న హత్య కేసులో నిందితులను పోలీసులు అదుపులో తీసుకున్నట్లు సమాచారం. రెండు రోజుల కిందట షరీన్‌నగర్‌లో సంజన్నను కిరాతకంగా హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో అంజి అతని కొడుకులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నాలుగు ప్రత్యేక బృందాలను నియమించారు. ఈ దర్యాప్తులోని బృందం అంజి అతని ముగ్గురు కొడుకులతోపాటు అశోక్ అనే మరో వ్యక్తిని జగన్నాథగట్టు కొండల్లో అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

● పోలీసుల కళ్లు గప్పేందుకు కారు వదిలేసి..

హత్య చేసిన తర్వాత అంజి అతని కొడుకులు హత్యా ఘటన ప్రాంతం నుంచి ఓ కారులో పరారయ్యారు. ఆ కారును గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని ఓ హోటల్ వద్ద వదిలేసి మరో కారులో పరారయ్యారు. పోలీసు కళ్లు గప్పేందుకే ఆ కారును అక్కడే వదిలేసి మరో కారులో పరారైనట్లు తెలిసింది. ఆ తర్వాత చిన్నటేకూరు వెళ్లి అక్కడి నుంచి జగన్నాథగట్టు ప్రాంతంలో ఉన్న ఓ కాలనీకి వెళ్లినట్లు సమాచారం. హత్య ఘటనకు కొన్ని గంటల ముందే అంజి తన భార్యను, కోడళ్లను ఎమ్మిగనూరు ప్రాంతంలోని ఓ గ్రామానికి పంపినట్లుగా సమాచారం. తన కుటుంబ సభ్యులపై సంజన్న వర్గీయులు దాడి చేస్తారని భావించి ఈ ముందు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది. ఆధిపత్య పోరు కోసమే ఈ హత్య చేసినట్లుగా పోలీసు వర్గాలు తెలిపాయి. ఆ రోజు ఉదయమే ఇమ్రాన్ అనే వ్యక్తి కూడా తనతో గొడవకు దిగడంతో సంజన్నను చూసుకునే ఇలాంటి వారందరూ తనపై కాలు దువ్వుతున్నారని భావించి ఈ హత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. హత్య చేసిన తర్వాత ఓ అడ్వకేట్ ద్వారా ఓ పోలీసుతో బేరసారాలు మాట్లాడేందుకు పురమాయించడాని సమాచారం. అయితే ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు చాలా సీరియస్‌గా ఉన్నారని, రాష్ట్ర స్థాయిలో డీజీపీ ఈ కేసుపై సమీక్షిస్తున్నారని, అలాంటివేమీ కుదరదన్నట్లు చెప్పినట్లుగా తెలిసింది. ఆ తరువాత డబ్బుల కోసం ఓ వ్యక్తికి ఫోన్ చేసేందుకు అంజి ఫోన్ ఆన్ చేయడంతో పోలీసులకు దొరికిపోయినట్లుగా తెలుస్తోంది. రహస్య ప్రాంతంలో ఉంచి విచారిస్తున్నట్లుగా సమాచారం. హత్య చేసేందుకు వెనుక ఎవరి ప్రోద్బలమైనా ఉందా.. ఎవరివైనా అండదండలు ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

● హత్య ఘటనపై ఎస్పీ సీరియస్

ఈ హత్య ఘటనపై నాలుగో పట్టణ పోలీసుల పని తీరుపై ఎస్పీ విక్రాంత్ పాటిల్ సెట్ కాన్ఫరెన్స్‌లో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అంజిని ఎన్నిసార్లు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారని అడిగినట్లు సమాచారం. కొద్ది కాలంగా అంజి ఆ ప్రాంతంలో హల్‌చల్ చేస్తున్నట్లుగా తన దృష్టికి వచ్చిందని, ఆయన కదలికలపై ముందుగా నిఘా పెట్టి ఉంటే ఈ ఘటన జరిగి ఉండేది కాదని అసంతృప్తి వ్యక్తం చేసినట్లుగా సమాచారం. ఈ ఘటన విషయంలో ఒకరిద్దరు పోలీసులపై ఉన్నతాధికారులు కొరడా ఝుళిపించే అవకాశం ఉంది. ఎస్పీ సీరియస్ కావడంతో జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిపించి గట్టిగా వార్నింగ్ ఇచ్చారు.



ఆల్ ది బెస్ట్..

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- హాజరు కానున్న 40,776 మంది విద్యార్థులు
- సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- కంట్రోల్ రూం నంబర్ 9885716544




కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు కొనసాగనున్నాయి. పాఠశాల విద్యలో తీసుకువచ్చిన సంస్కరణలతో ఆంగ్ల మాధ్యమం, జాతీయ విద్యా పరిశోధన శిక్షణా మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) సిలబస్‌తో మొదటిసారి పరీక్షలు జరనున్నాయి. విద్యార్థులపై నూతన సంస్కరణల ప్రభావం ఉన్నందున ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వంద రోజుల ప్రణాళిక అమలు చేసి మాదిరి ప్రశ్నాపత్రాలు, బిట్ బ్యాంకును అందించింది. పాఠశాలలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు పరీక్షలు నిర్వహించింది. ఈసారి రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఓపెన్ స్కూల్ అభ్యర్థులకు కూడా ఒకేసారి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలో మాస్ కాపీయింగ్‌కు చెక్ పెట్టేందుకు పాఠశాలల విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 517 పాఠశాలల నుంచి రెగ్యులర్ విద్యార్థులు 31,410 మంది, ప్రైవేటుగా 7,038 మంది, ఓపెన్ స్కూల్ ద్వారా 2328 మంది విద్యార్థులు కలిపి మొత్తం 40,776 మంది పరీక్షలకు హాజరవుతున్నారు. ఈ విద్యార్థుల కోసం 172 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరగనుంది. 30 నిమిషాల ముందే పరీక్ష కేంద్రంలోనికి విద్యార్థులను అనుమతిస్తారు. అయితే సమయం ముగిసే వరకు ఏ ఒక్క విద్యార్థి బయటకు రాకూడదని పాఠశాల విద్యాశాఖ నిబంధన పెట్టింది. జిల్లాలో 8 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షల కోసం 2208 మంది సిబ్బందిని నియమించారు. పరీక్ష కేంద్రాల్లో ఏదైనా అవాంఛనీయ సంఘటనలతో పాటు ఏదైనా ఫిర్యాదులను స్వీకరించేందుకు జిల్లా కేంద్రంలో విద్యాశాఖ అధికారులు కంట్రోల్ రూమును ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్ నెంబర్.9885716544 మొబైల్ నెంబరును అందుబాటులో ఉంచారు. విద్యార్థులు హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

సర్వం సిద్ధం : శ్యామ్యూల్ పాల్, డీఈఓ

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం చేశాం. పర్నీచర్స్‌ను విద్యుత్, తాగునీరు ఫ్యాన్లు, వెలుతురు, గాలి ఉండేలా ఏర్పాటు చేశాం. వైద్య బృందాలను నియమించాం. ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉంచాం. పేపర్ లీక్ వంటి వదంతులు ఫేక్ న్యూస్‌ను నమ్మవద్దని విద్యార్థులకు, తల్లిదండ్రులకు కోరుతున్నాం. ఒత్తిడి, ఆందోళన లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయండి. పదో తరగతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్.

మంచి ఫలితాలే లక్ష్యం

కలెక్టర్ పి.రంజిత్ బాషా



కర్నూలు కలెక్టరేట్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): 'ఆల్ ద బెస్ట్.. ఉజ్వల భవిష్యత్తుకు మొదటి మెట్టు ఈ పదో తరగతి. ఖచ్చితంగా పాస్ అవుతామన్న పాజిటివ్ థింకింగ్‌తో పరీక్షలు రాయండి. ఎలాంటి ఒత్తిడికి గురి కావొద్దు. భయం, ఆందోళన చెందవద్దు. ప్రశాంతంగా పరీక్షలు రాయండి. లక్ష్యాన్ని చేరుకోవాలన్న పట్టుదలతో విజయం సాధించండి..' అని కలెక్టర్ రంజిత్ బాషా పదో తరగతి విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఒత్తిడిని జయించి మంచి ఫలితాలను సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

మిర్చి వ్యాపారులకు దుకాణాలు

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో ఎండుమిర్చి వ్యాపారుల సౌకర్యార్థం అధికారులు షాపులను ఏర్పాటు చేస్తున్నారు. మిర్చి యార్డులో రైతుల నుంచి ఎండుమిర్చిని కొనుగోలు చేసిన తర్వాత డబ్బులను వారికి చెల్లించే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయనీ, దొంగతనాలు జరిగే అవకాశం ఉందని మిర్చి వ్యాపారులు ఇటీవల అధికారుల ఎదుట వాపోయారు. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు అనుమతితో వ్యాపారులే తమ సొంత ఖర్చులతో దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇచ్చినట్లు మార్కెట్ యార్డు కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. ఒక షాపునకు రూ.వెయ్యి అద్దె ప్రాతిపదికన 20 షాపులను వ్యాపారులకు కేటాయించడం జరిగిందన్నారు. ప్రస్తుతం 15 షాపులను వ్యాపారులు నిర్మించుకుంటున్నారని తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ రంజిత్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు.

నేడు ఆరోగ్యమిత్రల విధుల బహిష్కరణ

కర్నూలు హాస్పిటల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టుతో జరిగిన చర్చలు విఫలం కావడంతో ఆరోగ్య మిత్ర ఉద్యోగులు సోమవారంతో పాటు ఈ నెల 24 తేదీన విధులు బహిష్కరించనున్నట్లు ఏపీ వైద్య సేవ ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు సి.కంబగిరి, జి.రాజశేఖర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం జిల్లాలో ఉన్న ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ సిబ్బంది ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన నిర్వహిస్తామన్నారు. అలాగే ఈ నెల 27వ తేదీ మంగళగిరి ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు వద్ద నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. గత 17 సంవత్సరాలుగా ఫీల్డ్ సిబ్బంది సర్వీసును పరిగణనలోకి తీసుకుని తమను ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. వైద్యసేవ ఉద్యోగి చనిపోయిన కుటుంబాలకు రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజీ కల్పించాలని కోరారు. కర్నూలు, నంద్యాల జిల్లాలో 180 మంది ఆరోగ్యమిత్రలు, టీం లీడర్లు, ఆఫీస్ అసోసియేట్స్, డీఎంలు, ఉద్యోగులు శాంతియుత నిరసనలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఎంపీఎం రెడ్డి సేవలను భావితరాలకు తెలియజేయాలి

- అరుణభారతి అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి

శ్రీశైలం టోల్‌గేట్ వద్ద మద్యం పట్టివేత

7

నమో అహోబిలేశా..!

- దిగువ అహోబిలంలో అట్టహాసంగా గరుడోత్సవం
- దిగువలో ముగిసిన అహోబిలేశుని బ్రహ్మోత్సవాలు
- నేత్రపర్వంగా ప్రహ్లాద వరదస్వామి తెప్పోత్సవం



గరుడ వాహనంపై శ్రీవారి విహారం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రహ్లాద వరద గోవిందా.. గోవింద, లక్ష్మీనృసింహస్వామి గోవిందా.. గోవింద అంటూ భక్తులు పారవశ్యంతో స్తుతిస్తుండగా ప్రహ్లాదవరదుని గరుడోత్సవం కన్నులపండువగా సాగింది. పట్టువస్త్రాలు, స్వర్ణాభరణాలు, పూలమాలలతో అలంకృతుడైన ప్రహ్లాద వరదస్వామి గరుత్మండిపై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. అహోబిలేశుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా దిగువ అహోబిలంలో ప్రహ్లాద వరదునికి గరుడోత్సవ సేవ అట్టహాసంగా నిర్వహించారు. ఈ కమనీయ వేడుక శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు జరిగింది. గరుడసేవ సందర్భంగా తమిళనాడు రాష్ట్రంలోని చోళ సింహపురం యోగా నృసింహస్వామి దేవస్థానం నుంచి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, పుష్పమాలలు, చీరసారెలను సమర్పించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు బ్రహ్మోత్సవాలకు భారీగా తరలిరావడంతో దిగువ అహోబిల క్షేత్రం ఆధ్యాత్మికతతో ఓలలాడింది. బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం చేపట్టారు. సకల దేవతలకు, అష్టదిక్పాలకులకు వీడ్కోలు చెబుతూ ధ్వజస్తంభంపై ఆవిష్కరించిన గరుడ పటాన్ని కిందికి దించారు.



శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు

● ఉత్సాహంగా తెప్పోత్సవం: దిగువ అహోబిల క్షేత్రంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాద వరదస్వామి తెప్పోత్సవం ఆదివారం నేత్ర పర్వంగా జరిగింది. ఉభయ దేవేరులతో తెప్పలో కొలువైన ప్రహ్లాద వరదస్వామి కోనేటిలో శోభాయమానంగా విహరించారు. అర్చకులు వేదమంత్రాలు పఠిస్తుండగా, భక్తులు నారసింహ కీర్తనలు ఆలపిస్తుండగా పున్నమి వెన్నెలలో ఆది దంపతులు తెప్పపై తిరుగాడారు.

బహిరంగ చర్చా వేదిక వాయిదా

తుగ్గలి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సామాజిక తనిఖీలపై నిర్వహించే బహిరంగ చర్చా వేదిక వాయిదా పడినట్లు ఏపీవో హేమ్ సుందర్ ఆదివారం తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి పనులపై గత 20 రోజుల నుంచి సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల్లో తనిఖీలు చేశాయన్నారు. 19వ తేదీకి వాయిదా వేశామని తెలిపారు.

జలచౌర్యాన్ని అరికట్టారు..

హాలహర్వి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎల్ఎల్‌సీ కింద జలచౌర్యాన్ని అరికట్టి, ఆయకట్టు చివరి వరకు ఆయకట్టు సాగునీరు అందించడానికి కృషి చేసిన సిబ్బందిని డీఈ హుసేన్ బాషా అభినందించారు. ఆదివారం ప్రశంసా పత్రాలను అందజేశారు.



సిబ్బందికి ప్రశంసా పత్రం ఇస్తున్న బోర్డు అధికారులు

బాపురం, చింతకుంట, హొళగుంద పరిధిలో పని చేసిన నాగరాజు, ప్రవీణ్ కుమార్, నాగేంద్ర పాటు మిగతా సిబ్బందికి అందజేశారు. ఏఈ దుర్గాప్రసాద్, కిరణ్ పాల్గొన్నారు.

అనాథలను ఆదుకోవాలి



దుస్తులు పంపిణీ చేస్తున్న పారా కుటుంబీకులు

మద్దికెర, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎవరూ లేని అనాథలను ఆదుకోవాలని దాతలు పారా రామచంద్రప్రసాద్, పారా విశ్వనాథ్ (చిట్టెన్న) అన్నారు. ఆదివారం పెరవలి గ్రామంలో 200 మందికి దుస్తులు పంపిణీ చేశారు. తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో వదలొద్దని సూచించారు. పారా జయవర్ధన్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, సేవా సమితి సభ్యులు వలి, పక్కీరప్ప, నారాయణ, పెద్దయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

స్పందించారు.. చెత్త తొలగించారు



కోయనగర్‌లో చెత్తను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఆలూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కోయనగర్‌లో చెత్త పేరుకుపోయిందని ఈ నెల 16న ఆంధ్రజ్యోతిలో 'తొలగించేదెప్పుడు?' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన పంచాయతీ ఈవో ప్రభాకర్ రావ్ సిబ్బంది ద్వారా చెత్తను తొలగించారు. విద్యార్థులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



అట్టలు అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్సీ బాలుర నెంబర్-1 హాస్టల్ వార్డెన్ సిద్దప్ప, ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరీక్షల అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. సంజయ్, నరసింహ, ఉమాకాంత్, బాషా, వెంకట్ పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడాలి



నీటిని సరఫరా చేస్తున్న పంచాయతీ అధికారులు

మద్దికెర, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వాడుకోవాలని సర్పంచ్ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ సూచించారు. ఆదివారం పెరవలి గ్రామంలో రెండు తాగునీటి ట్యాంకర్లను ప్రారంభించారు. రోజూ పది ట్యాంకర్ల నీటిని సరఫరా చేస్తామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి పథకాలను మరమ్మతులు చేశామన్నారు.

పన్నులు చెల్లించండి



ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది

ఆదోని టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఆస్తి, తాగు నీటి పన్నులను చెల్లించాలని మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది కోరారు. ఈమేరకు ఆదివారం పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఆర్‌వో నాసిర్ మాట్లాడుతూ పన్నుల బకాయిలు ఈనెల 30వ తేదీ లోగా చెల్లించాలని, లేని పక్షంలో వడ్డీతో పాటు చెల్లించాల్సి ఉంటుందన్నారు. బకాయిలు చెల్లించక పోతే తాగు నీటి కొళాయి కనెక్షన్‌ను తొలగిస్తామని హెచ్చరించారు. ఆర్‌ఐలు చంద్ర మోహన్, శేక్షవలి, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

దేవరకు పటిష్ట బందోబస్తు



సీఐ వంశీనాథ్

దేవనకొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18,19 న జరగనున్న గద్దెరాళ్ల దేవరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ వంశీనాథ్ తెలిపారు. 6 మంది సీఐలు, 12 మంది ఎస్సైలు, మరో 200 మంది ఏఎస్సై, కానిస్టేబుల్, హైంపార్టీ, మహిళా పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తామన్నారు. గద్దెరాళ్లకు ఆటోలు, బైక్‌లకు మాత్రమే అనుమతి ఉంటుందని, మద్యాన్ని నియంత్రిస్తామని, డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచుతామన్నారు.

పంటలను కాపాడుకునేందుకు..

- హంద్రీనీవాకు నిలిచిన నీటి సరఫరా
- ఇసుక మూటలు వేసి ఆఖరు బొట్టును వాడుకుంటున్న రైతులు





కాలువలో ఇసుక మూటలు వేసిన రైతులు.. మోటర్ల ద్వారా పొలాలకు నీటి సరఫరా

మద్దికెర, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దికెర, బురుజుల, పెరవలి, ఎం.అగ్రహారం, బీఎన్ పేట, ఎడవలి, బొమ్మనపల్లి, కొత్తపల్లి, హంపా, రాంపురం గ్రామాల రైతులు హంద్రీనీవా కాలువను నమ్ముకుని 10వేల ఎకరాల్లో వివిధ పంటలను సాగుచేశారు. ఈ ఏడాది వేరుశనగ, మినుము, పచ్చిమిరప వేశారు. ప్రతి ఏడాది మే రెండో వారం వరకు హంద్రీనీవా నీరు సరఫరా అయ్యేది. అయితే ఈ ఏడాది మార్చి 10వ తేదీకే నీటి సరఫరా నిలిచిపోవడంతో పంటలు ఎండుముఖం పట్టాయి.

ఇసుక మూటలు వేసి..

హంద్రీనీవా కాలువలో ఉన్న కాస్త నీటిని ఉపయోగించుకునేందుకు రైతులు ఇసుకమూటలను అడ్డంగా వేసి, ఆ నీటిని వాడుకుంటున్నారు. అంతేగాక బురుజుల పంచాయతీ వారు కూడా ఈ హంద్రీనీవా నీటినే నిల్వ చేసి, తాగునీరు అందిస్తారు. అయితే ఈ ఏడాది ఉన్న ఫలంగా నీరు నిలిచిపోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి, తాగునీటి అవసరాలకు కూడా ఇబ్బంది పడే ప్రమాదముంది.





కంక తేలిన చిప్పగిరి - దౌల్తాపురం రహదారి... అధ్వానంగా మారిన చిప్పగిరి - డేగులపాడు రహదారి

నరక దారులు

చిప్పగిరి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రహదారులు నరకాన్ని తలపిస్తున్నాయి. చిప్పగిరి - డేగులపాడు రహదారి గుంతలమయంగా మారింది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే చిప్పగిరి - దౌల్తాపురం రహదారి కంకర తేలింది. దారి సరిగా లేకపోవడంతో గ్రామస్థులు అనంతపురం జిల్లా గుంతకల్‌కు వెళ్లి అక్కడ నుంచి చిప్పగిరికి వస్తున్నారు. వీటితో పాటు నేమకల్లు, సంఘాల, రామదుర్గం, తిమ్మాపురం, కుందనగుర్తి, నంచర్ల ఆమలుకు వెళ్లే రోడ్లు కనీస మరమ్మతులకు నోచుకోలేదు.





ఆదోనిలో నివాళులు అర్పిస్తున్న ఆవోపా నాయకులు.. పత్తికొండలో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

పొట్టి శ్రీరాములు జయంతి

ఆదోని టౌన్ మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆవోపా ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 125వ జయంతి నిర్వహించారు. ప్రధాన కూడలిలో ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. శివశంకర్ నగదర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఆవోపా అధ్యక్షుడు, భారత్ సేవా రత్న అవార్డు గ్రహీత డా వంకదారు శ్రీనాథ్ గుప్తా, రఘు, వెంకటేశ్వరులు, ఈరన్న శెట్టి రత్నయ్య, రాజేష్, కిరణ్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ డా. అనుపమ అధ్వర్యంలో పొట్టి శ్రీరాములుకు నివాళి అర్పించారు. ఎంఈ ఇంతియాజ్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

పత్తికొండ: పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్యాంబాబు పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పించారు.

వెల్దుర్తి: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఆదివారం ఆర్యవైశ్యులు నిర్వహించారు. ముఖ్య అతిథులు సముద్రాల శ్రీరాములు, సముద్రాల సురేశ్‌బాబు, ఒంగోలు సాయిప్రసాద్, క్రిష్ణకిరణ్, వేముల శేషు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాతబస్టాండ్‌లో మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. చాటకొండ కార్తిక్, చాటకొండ సత్యనారాయణ, చాటకొండ ప్రసాదు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగితే చర్యలు

- ఆదోనిలో రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

ఆదోని, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదోని టూ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్సై రామనాథ్ హెచ్చరించారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీట్ ఉండి ఇటీవల నేరాలకు పాల్పడని వారి కుటుంబ పరిస్థితులు, జీవన విధానం అడిగి తెలుసుకున్నారు. సత్ప్రవర్తన ఉంటే రౌడీ షీట్లు తొలగిస్తామని భరోసా ఇచ్చారు. కాలనీల్లో రౌడీషీటర్లపై విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ సాధారణ ప్రజలకే కానీ నేరస్థులకు కాదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే, హత్య కేసుల్లో నిందితులు దాడులు, బెదిరింపులకు పాల్పడితే ఊరుకోనని హెచ్చరించారు. ఇప్పటికైనా పద్ధతులు మార్చుకోవాలని లేకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ఉచిత ఎంసెట్ కోచింగ్

మద్దికెర, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆపద్బాంధవ సేవా సమితి అధ్వర్యంలో ఉచిత ఎంసెట్ కోచింగ్ ఇస్తున్నట్లు అధ్యక్షుడు చౌక్కా సునీల్ కుమార్ తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ మార్చి 17వ తేదీ నుంచి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కోచింగ్ ఉంటుందన్నారు. ఇంజనీరింగ్‌కు సిద్ధపడే విద్యార్థులు 8247452174 నెంబర్‌లో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

హొళగుంద, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని ఎస్సై బాల నరసింహులు, టీడీపీ నాయకుడు చిన్నహ్యాట శేషగిరి అన్నారు. ఆదివారం చిన్నహ్యాట గ్రామానికి చెందిన జనవరాజ ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎస్సై ప్రారంభించారు. పెద్దహ్యాట మల్లయ్య, ఎండీ హళ్లి సర్పంచ్ సుధాకర్, కురువ పొంపాపతి, మల్లికార్జున, కోగిలతోట శేషప్ప పాల్గొన్నారు.

పనిచేసి పస్తులుండాలా?

- రెండు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాల్లేవ్



ఎర్రగుడిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

తుగ్గలి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వలస వెళ్లొద్దు, పనులు కల్పిస్తామని చెప్పి తీరా పనులు చేశాక వేతనాలు ఇవ్వకుండా పస్తులు పెడుతున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 18,707 జాబ్‌కార్డులు ఉన్నాయి. ఈ ఏడాది దాదాపు 5వేల మంది పనులకు వెళుతున్నారు.

వేతనాలు లేవు

పనులు చేసి రెండున్నర నెలలు గడుస్తున్నా వేతనాలు ఇవ్వడం లేదు. వలస వెళ్తే పస్తులుండే బాధ తప్పుతుందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారానికోసారి వేతనాలు ఇస్తే ఇలా పస్తులుండే బాధ తప్పుతుందన్నారు. ఇకపై వేతనాలు ఇచ్చేదాక రామని తెగేసి చెపుతున్నారు.



రెండు నెలలుగా వేతనాలు లేవు

ఉపాధి పనులు చేసి రెండు నెలలైనా వేతనాలు లేవు. ఏ వారం కూలీ ఆ వారమే ఇవ్వాలి. ఇలా అయితే కుటుంబ పోషణ భారమవుతుంది. - **సంజీవ, వ్యవసాయ కూలీ, రాతన**



ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

వేతనాలు అందకపోవడంతో ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీలకు ఏం చెప్పాలో అర్థం కావడం లేదు. వేతనాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- అక్తర్ బాషా, సీనియర్ మేట్, చెన్నంపల్లి

అవిశ్వాసానికి రంగం సిద్ధం

- ఆదోని మున్సిపాలిటీ నూతన చైర్‌పర్సన్‌గా లోకేశ్వరి?



వాల్మీకి శాంత, లోకేశ్వరి (ఫైల్)

ఆదోని టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్‌పర్సన్ వాల్మీకి శాంతపై అవిశ్వాసానికి రంగం సిద్ధమైంది. గతంలో 2021లో వాల్మీకి శాంత చైరపర్సన్‌గా ఎంపి కైన సమయంలో పదవీకాలన్ని ఇద్దరికి వర్తించేలా మాట్లాడుకున్నట్లు వైసీపీ కౌన్సిలర్లు అంటున్నారు. అయితే రాజీనామా చేసేందుకు చైర్‌పర్సన్ వాల్మీకి శాంత అంగీకరించలేదు. నిబంధనల మేరకు చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు నాలుగేళ్లు పూర్తికావాల్సి ఉంది. కాగా ఈనెల 17వ తేదీతో మునిసిపల్ కౌన్సిల్ ఏర్పడి నాలుగేళ్ళ కాలం పూర్తి కానుంది. మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద రెడ్డి ఆదేశానుసారం వాల్మీకి శాంత రాజీనామా చేయకపోవడంతో అవిశ్వాస తీర్మానంతో ఆమెను పదవి నుంచి దింపడానికి నిర్ణయించారు.

కౌన్సిల్‌లోని మొత్తం 42మంది కౌన్సిలర్లలో ఒక్కరు మాత్రం టీడీపీ నుంచి ఎంపిక కాగా, మిగిలిన 41మంది వైసీపీ తరఫున గెలిచినవారే. ఇటీవల కల్లుబావి కౌన్సిలర్ నాగలక్ష్మమ్మ మరణించారు. అయితే అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఎమ్మెల్యే పార్థసారథికి ఐదుగురి వైసీపీ కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. దీంతో వైసీపీ బలం 35కు పడి పోయింది.

నేడు కలెక్టర్ వద్దకు తీర్మానం

అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే కలెక్టర్ అనుమతి అవసరం. దీంతో కౌన్సిలర్లు త్వరలో కలెక్టర్‌ను కలిసి, ఆయన నోటీసుతో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అవకాశమున్నట్లు సమాచారం.

మద్యం దుకాణం తొలగింపు



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): డీవైఎఫ్ఐ పోరాటంతోనే పట్టణంలోని కొత్త బస్టాండ్ రహదారిలోని ఆలయం పక్కన మద్యం దుకాణాన్ని తొలగించారని ఆ సంఘ పట్టణ అధ్యక్షుడు వీరేష్ అన్నారు. ఆదివారం తొలగించిన దుకాణం వద్ద మాట్లాడారు. ఆయలాలు, ప్రార్థన మందిరాలు, మసీదులు, పాఠశాలల వద్ద మద్యం దుకాణం ఉండకూడదని ప్రభుత్వ నిబంధనలు ఉన్నా ఇక్కడ ఏర్పాటు చేయడంతో సంతకాలు సేకరించి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. స్పందించిన కలెక్టర్ మద్యం దుకాణాన్ని తొలగించాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారన్నారు.

వెండి సమర్పణ

ఆదోని టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కన్యకా పరమేశ్వరి ట్రస్ట్ తరఫున అధ్యక్షుడు రాచోటి రఘురామ్, కార్యదర్శి గొంది పద్మనాభయ్య ఆదివారం వాసవి అమ్మవారికి 300 గ్రాముల వెండిని సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి అలయ అధ్యక్షుడు కేటీజీ శ్రీనివాస్, వేణు, మిరియాల మారుతి పాల్గొన్నారు.



వెండిని అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

కపటి నిందితులపై రౌడీ షీట్

ఆదోని రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కపటి గ్రామానికి చెందిన ఏడుగురుపై రౌడీషీట్ తెరిచినట్లు ఇస్వీ ఎస్సై నాగేంద్ర ఆదివారం తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 14న గ్రామానికి చెందిన ఈరన్న కుటుంబంపై అదే గ్రామానికి చెందిన వెంకటేశులు, వెంకటస్వామి, రాజు, రవి, తిరుమలేష్, వీరేష్, గిడ్డయ్య దాడికి పాల్పడ్డారని, బాధితుడి ఫిర్యాదు మేరకు వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మృతదేహం ఆచూకీ లభ్యం

ఆదోని రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రెండురోజుల క్రితం బసాపురం ఎల్లెల్సీలో గల్లంతైన హరికృష్ణ మృతదేహం ఆచూకీ ఆదివారం లభ్యమైంది. అగ్నిమాపక అధికారులు, ఇస్వీ పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో యువకుడి మృతదేహాన్ని వెలికి తీశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు.

వైసీపీ హయాంలోనే టమోటా యూనిట్‌కు నిధులు

- ప్రభుత్వాన్ని విమర్శిస్తే అక్రమ కేసులా?: మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

పత్తికొండ టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ ప్రాంతంలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ గత వైసీపీ ప్రభుత్వంలోనే శంకుస్థాపన చేశామని మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి అన్నారు. ఆదివారం స్వగృహంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జీవోను, స్థలాన్ని మార్చి అదే యూనిట్‌కు మరోచోట భూమిపూజ చేసి తామే చేసినట్లుగా ప్రచారం చేసుకోవడం సమంజసం కాదన్నారు. ఏళ్లుగా ఉన్న ప్రజల ఆకాంక్షను దృష్టిలో పెట్టుకుని నాటి సీఎం జగన్ హోసూరు గ్రామ సమీపాన భూమి పూజ చేశారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం యూనిట్‌ను కనకదిన్నె దగ్గరకు మార్చి జిల్లా మంత్రి చేత మరోసారి భూమి పూజ చేయడం హాస్యాస్పదమన్నారు. ఎమ్మెల్యే శ్యాంబాబు సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడకుండా అనవసరమైన విమర్శలు చేశారనానరు. రాష్ట్రంలో ఎవరైనా ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తూ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. కన్వీనర్ నాగరాజు, ఎంపీపీ నారాయణదాసు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు భాస్కర్ నాయక్, సర్పంచులు కేశవరెడ్డి, శ్రీరాములు, గాంధీ రెడ్డి, నాయకులు గణపతి, రవికుమార్ రెడ్డి, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

వసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మహబూబ్‌ఖాన్



పత్తికొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పత్తికొండ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మహబూబ్‌ఖాన్ తెలిపారు.

ప్రశ్న: నియోజకవర్గంలో ఎన్ని నీటి పథకాలు ఉన్నాయి ?

జవాబు: 267 పీడబ్ల్యూఎస్, 3 సీపీడబ్ల్యూఎస్ తాగునీటి పథకాలు ఉన్నాయి.

ప్రశ్న: ప్రస్తుతం ఎన్నిగ్రామల్లో తాగునీటి ఎద్దడి ఉంది?

జవాబు: అన్ని గ్రామల్లో నీటి పథకాలు పనిచేస్తున్నాయి. ఏ గ్రామంలో కూడా తాగునీటి ఎద్దడిఔ లేదు.

ప్రశ్న: సీపీడబ్ల్యూఎస్ స్కీంలద్వారా ఎన్ని గ్రామాలకు నీరు అందిస్తున్నారు?

జవాబు: 3 సీపీడబ్ల్యూఎస్ స్కీంలద్వారా సుమారు 35 గ్రామాలకు తాగునీరు సరఫరాచేస్తున్నాం. ఈ పథకం ద్వారా తాగునీరు అందే గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడికి అవకాశం ఉండదు.

ప్రశ్న: పీడబ్ల్యూఎస్ స్కీంలు ఉన్న గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ఎలాంటి ప్రణాళికలు అమలు చేస్తున్నారు?

జవాబు: రెండు మూడు సంవత్సరాల్లో తాగునీటి ఇబ్బందులు ఎదురైన గ్రామాల వివరాలను పరిగణనలోకి తీసుకుంటున్నాం. ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసి చర్యలు తీసుకుంటున్నాం. ఒక వేళ సమస్యలు ఉంటే సంబంధిత గ్రామాల్లో బోర్లను మరింత లోతుకు తవ్వి, అదనపు బోర్లు ఏర్పాటు చేస్తాం. పక్కనే అందుబాటులో ఉన్న ప్రైవేటు బోర్లను తాగునీటి పథకానికి అనుసంధానం చేస్తాం. ఇవేవీ అనుకూలించని గ్రామాల్లో ట్యాంకర్లద్వారా తాగునీరు సరఫరాచేసేందుకు సిద్ధమవుతున్నాం.

ప్రశ్న: వేసవిలో తాగునీటి పథకాలకు నిధులు ఏమైనా వచ్చాయా?

జవాబు: వేసవిలో తాగునీటి పథకాల నిర్వహణకు నిధుల మంజూరు కోరుతూ ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం.

నీళ్లివ్వండి మహా ప్రభో

- సర్వసభ్య సమావేశంలో జడ్పీటీసీల ఆందోళన
- తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు
- మంత్రి టీజీ భరత్



సమావేశంలో జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మంత్రి టీజీ భరత్, కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు రంజిత్ బాషా, రాజకుమారి, జేసీ డాక్టర్ బి.నవ్య

(5వ పేజీ తరువాయి)

మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తక్షణమే ఆదుకోవాలని రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులను కాపాడాలని ఆయన కోరారు. వ్యవసాయ రంగాన్ని కాపాడి వలసలు వెళ్లకుండా నివారించాలని కోసిగి జడ్పీటీసీ పాటిల్ కోరారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు. వరి ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కొత్తపల్లి జడ్పీటీసీ కోరారు. మినుము పంటలకు మద్దతు ధర కల్పించాలన్నారు. చెరువుల్లో మట్టిని తొలగించి మరమ్మతులు చేపట్టాలని వెల్దుర్తి జడ్పీటీసీ సుంకన్న కోరారు.

- అధికార పార్టీ మంత్రి, ఎమ్మెల్యేలు సమావేశం మధ్యలో వెళ్లిపోవడంతో ప్రతిపక్ష ఎమ్మెల్యే, జడ్పీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల తరపున సమస్యలను విన్నవించేందుకు వస్తే మధ్యలో ఎలా వెళ్లి పోతారని కొందరు జడ్పీటీసీలు మండిపడ్డారు. జిల్లా పరిషత్ చైర్మన్‌పై ఇరిగేషన్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ డీఈ లేచి చైర్మన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంత చేసినా తమ శాఖ గురించి తప్పుగా మాట్లాడవద్దని వారిం చారు. ప్రభుత్వం ఆదేశాలు రాకపోతే తాము ఎలా పని చేస్తామని ఖరాఖండిగా చెప్పేశారు. గుండ్రేవుల ప్రాజెక్టు మూడు రాష్ట్రాలకు సంబంధించి ఉంది. అలాంటప్పుడు ఇరిగేషన్ అధికారులు ఒక్కరిదే తప్పు అనడం సబబు కాదన్నారు.

పశ్చిమ ప్రాంతంలో తీవ్రమైన నీటి ఎద్దడి



జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో తీవ్రమైన నీటి ఎద్దడి ఉంది. ఈ ప్రాంతంలో నీరిందించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలి. కోడుమూరు, ఆలూరు నియోజకవర్గాల్లో నీటి సమస్య తీర్చడ కోసం ఎంపీ నిధుల నుంచి రూ.60 కోట్లు ఇచ్చాం. ఆస్పరి వద్ద అలారుదిన్నె బ్రిడ్జి వద్ద హెచ్ఎస్ఎస్ నుంచి మూడు టీఎంసీల నీటి కేటాయింపు గాజులదిన్నె ప్రాజెక్టుకు ఉంది. పైప్‌లైన్ ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతంలో తీవ్రమైన నీటి సమస్య ఎదుర్కొంటున్న హట్టేకల్, పుప్పాలదొడ్డి, బిల్లేకల్లు గ్రామాలకు నీటి సమస్య తీరుతుంది. గాజులదిన్నె ప్రాజెక్టుకు కోడుమూరు చాలా దగ్గరగా ఉంది. కోడుమూరు నీరు రావడం లేదని ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. జీడీపీ నుంచి నంద్యాల జిల్లా డోన్‌కు రూ.82 కోట్లు ఖర్చు చేసి నీటిని తీసుకెళ్లారు. కోడుమూరుకు శాశ్వత నీటి సమస్యను పరిష్కరించాలి. పాణ్యం ఎమ్మెల్యే గుండ్రేవుల ప్రాజెక్టుపై శాసనసభలో లేవనెత్తడం వల్ల చర్చ జరిగింది. అదేవిధంగా వేదవతి ప్రాజెక్టుపై కూడా అసెంబ్లీలో చర్చ జరగాలి. ఈ క్రమంలో నీటి సమస్య పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలి. **- బస్తిపాటి నాగరాజు, కర్నూలు ఎంపీ**

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలి. గ్రామాల్లో నీటి సమస్యను తీర్చడానికి గ్రామ పంచాయతీ నిధులను వినియోగించుకోవాలి, జడ్పీ నుంచి సాధ్యమైనంత వరకు నిధులను సమకూరుస్తాం. గ్రామాలలో చేతి పంపులను వినియోగంలోకి తీసుకురావాలి. రబీలో ఎరువుల కొరత వచ్చింది. వచ్చే ఖరీఫ్‌లో ఎరువుల కొరతల లేకుండా చర్యలు తీసుకోవాలి. కృష్ణా నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు వీలుగా ఈ ప్రాంతంలో రిజర్వాయర్లు నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది. **- ఎర్రబోతుల పాపిరెడ్డి, జడ్పీ చైర్మన్**

ఆరు మండలాల్లో నీటి సమస్య : ఎమ్మెల్యే విరూపాక్షి



ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో నీటి సమస్య ఉంది. ఆలూరులో చెరువు అన్యాక్రాంతం కాకుండా రిజర్వాయర్ నిర్మించాలి. హొళగుంద మండలం పక్కనే ఎల్లెల్సీ ఉన్నా నీటి సమస్య తీవ్రంగా ఉంది. దేవనకొండ మండలం బండకుంటలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం చేపట్టాలి. వెంకటాపురంలో బోర్లు రిపేరి చేయించాలి. పందికోన నుంచి నీటి సరఫరా చేయిం చాలి. సర్వసభ్య సమావేశంలో అధికార పార్టీ మంత్రి, ఎమ్మెల్యేలు మధ్యలో వెళ్లిపోతే ఎవరు సమాధానాలు చెప్పాలి?. జడ్పీటీసీలు, ఎంపీపీలు పనిపాట లేకుండా సమావేశానికి వస్తారా. తాగునీరు.. వ్య వసాయం, ఇరిగేషన్‌పై కర్నూ లు ఎంపీ సమా ధానం చెప్పాలి. రైతుల ఆత హత్యలపై ప్రభుత్వం తరపున మంత్రి సమాధానం చెప్పకుండా వెళ్లిపోతే ఎలా? ఎన్ఆర్ఈజీఎస్ కింద ఒక్కో మండలానికి తాగునీటి అవసరాలకు రూ.50 లక్షలు కేటాయించాలి.

- విరుపాక్షి, ఆలూరు ఎమ్మెల్యే

మద్దతు ధర అంశం కేంద్ర దృష్టికి : కలెక్టర్ రంజిత్ బాషా



మిర్చికి మద్దతు ధర అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కందులు ఆదోని సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోడౌన్‌కు రాకముందే గ్రామాలలో నాణ్యతను చెక్ చేయాలి. జిల్లాలో యూరియా కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. వచ్చే సమావేశంలో తుంగభద్ర బోర్డు అధికారులు కూడా సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలి. హంద్రీనీవా ద్వారా జిల్లాలో ఉన్న చెరువులను మార్చి నాటికి 90 శాతం నీరు నింపే విధంగా చర్యలు తీసుకున్నాం. 4,5, చెరువుల మాత్రమే మిగిలిపోయాయి. వాటిని త్వరలోనే నింపుతాం. వెల్దుర్తిలో షాదిఖానా ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి.

- ఉదయం జడ్పీ మినీ సమావేశ భవనంలో 1వ స్థాయి సంఘ సమావేశం జరిగింది. అభివృద్ధికి సంబం ధించి ఆరు అంశాలను తీర్మానించారు. సర్వసభ్య సమావేశంలో 2024-2025 సవరణ బడ్జెట్, 2025-2026 అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. జడ్పీ డిప్యూటీ వెంకట సుబ్బారెడ్డి, జడ్పీటీసీ, ఎంపీపీలు, పరిపాలన అధికారులు జితేంద్ర, మురళీమోహన్‌రెడ్డి, బసవ శేఖర్, సరస్వతమ్మ పాల్గొన్నారు.

కొన్ని మండలాల్లో సమస్య : గౌరు చరితారెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే



నియోజకవర్గంలోని కొన్ని మండలాల్లో తీవ్ర నీటి ఎద్దడి ఉంది. ప్రధానంగా కల్లూరు మండలం యాపర్ల పాడు గ్రామంలో పైప్‌లైన్ మం జూరు చేయాలి. ఉలింద కొండ, పర్ల, ఎ.గోకులపాడు, తడకనపల్లె గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. ఓర్వకల్లు మండలం తిప్పాయిపల్లె, కొమరోలు, చెన్నంశెట్టి పల్లె, సోమయాజుల పల్లె గ్రామాలలో రవాణా సౌకర్యం కల్పించాలి.

అధ్యాపకుల సంఘం కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో ఎన్నికల అధికారి మహ్మద్ వాహీద్ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా దేవనకొండ జీజేసీ జువాలజీ లెక్చరర్‌గా పని చేస్తున్న బి.లక్ష్మీనరసింహులు, జేవీ రమణగుప్తను ఉపాధ్యక్షులుగా, కే రామాంజనేయులు సెక్రటరీగా, పి.డేవిడ్‌ను జాయింట్ సెక్రటరీ, ట్రెజరీగా రాహుల్ కుమార్‌ను, మహిళా సెక్రటరీగా ఎస్.రేష్మాతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పి.శ్రీనివాసులు, రవీంద్రబాబును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు లక్ష్మి నరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వ అధ్యాపకుల సంక్షేమం, హక్కుల కోసం కృషి చేస్తానని తెలిపారు. తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అధ్యాపక బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

మద్దికెర, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన కోదండ రాముడు, వేణమ్మ దంపతుల కుమార్తె కోమలికి, బనగానపల్లె మండలం పలుకూరు గ్రామానికి చెందిన కురువ మునయ్య, తులసమ్మ దంపతుల కుమారుడు భీమశేఖర్‌తో 2020 జూన్ 20వ తేదీన వివాహమైంది. కట్న కానుకల రూ.10 లక్షలు, 15 తులాల బంగారం ఇచ్చి ఘనంగా వివాహం జరిపించారు. రెండేళ్ల పాటు వీరి కాపురం సవ్యంగా సాగింది. అయితే భర్త, అత్తమామలు, తమ్ముళ్లు అదనపు కట్నం కోసం వేధించడం మొదలు పెట్టారు. 2022లో ఓ రాజు రాత్రి భర్త భీమ శేఖర్ కోమలని హతమార్చాలని ప్రయత్నించాడు. ఆమె కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు రక్షించారు. అయితే తమ కొడుకు భీమశేఖర్‌కు దెయ్యం పట్టిందని, అలా ప్రవర్తించాడంటూ నమ్మబలికి పుట్టినిల్లయిన అగ్రహారానికి పంపించారు. పలుసార్లు పంచాయితీలు జరిగినప్పటికీ అదనం కట్నం కోసమే వేధిస్తుండటంతో ఆదివారం మద్దికెర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భర్తతో పాటు అతడి తమ్ముళ్లయిన రాము, సూరి, కుటుంబ సభ్యులపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయకుమార్ తెలిపారు.

బావిలో మహిళ మృతదేహం



మృతదేహం లభ్యమైన బావి ఇదే

ఆస్పరి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైనా ఆస్పరిలోన నిత్యం జనాలు తిరిగే గాంధీపార్క్ వద్ద ఉన్న పెద్దబావిలో నీరు పూర్తిగా అడుగంటి పోయాయి. ఎవరో గుర్తు తెలియని మృతదేహం ఆదివారం మధ్యాహ్నం లభించింది.. బావి కింద భాగంలో అడుగంటిన నీటిలో మృతదేహం బోర్లపడి ఉంది. అందరూ మృతదేహాన్ని చూసి ఎర్రటి దుస్తులు వేసుకొని వ్యక్తి మృతి చెందాడని అనుకున్నారు. ఆ మృతదేహాన్ని బయటకు తీయడానికి పోలీసులు చర్యలు చేపట్టారు. సాయంత్రం ఆదోని నుంచి వచ్చిన వ్యక్తులు బోర్లపడి ఉన్న మృతదేహాన్ని ఆస్పరి సీఐ మస్తాన్ వలి పోలీసులు సమక్షంలో బయటకు తీశారు. తీరా బయటకు తీసిన శవాన్ని మహిళగా గుర్తించారు. ఎర్రటి పంజాబీ డ్రస్సు, చేతులకు గాజులు, కాళ్లకు పట్టీలు ఉన్నాయి. చనిపోయిన మహిళ వయస్సు దాదాపుగా 35 నుంచి 40 వయసు ఉండవచ్చని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

మంత్రాలయం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం దగ్గర జగనన్న కాలనీ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపారు. ఆదివారం సాయంత్రం పశువుల కాపరులు పొలంలో ఉన్న చెట్టుకు ఉరివేసుకున్న దృశ్యాన్ని చూసి మంత్రాలయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మూడు రోజుల క్రితమే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని తెలిపారు. మృతుడి వయస్సు 30-35 ఏళ్ల ఉండవచ్చని, నల్లటి గళ్లచొక్కా, బూడిద కలర్ ప్యాంటు ధరించి ఉన్నారని చెప్పారు. మృతుడి వద్ద సెల్‌ఫోన్ లభ్యమైనప్పటికీ స్విచ్ఛాఫ్ కావడం, దానికి లాక్ ఉండడంతో ఎటువంటి ఆచూకీ లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఆరుగురిపై కేసు నమోదు



మాట్లాడుతున్న ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్

కోవెలకుంట్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సంజామల మండలం ఆకుమల్లలో ఆదివారం ఉదయం టీడీపీకి చెందిన ఇరువర్గాల ఘర్షణలో దుబ్బా గోవిందరెడ్డి, తిమ్మయ్యతో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ తెలిపారు. ఆదివారం కోవెలకుంట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టరు కార్యాల యంలో ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఒకే పార్టీకి చెందిన దుబ్బా గోవిందరెడ్డి వర్గానికి, మహేశ్వర్‌రెడ్డి వర్గానికి మధ్య గత కొంత కాలంగా విభేదాలు ఉన్నాయి. గ్రామంలో ఏటా నిర్వహించే పుల్లరి విషయంలో విభేధాలు తలెత్తాయి. అంతేకాక సంత మార్కెట్ ఎక్కడ ఏర్పాటు చేయాలన్న విషయంతో పాటు గ్రామ సంఘంలో పెద్దమనుషుల నియామకం, పంట కాలువలకు రస్తా విషయంలో వీరి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ఇవి కాస్త పెరిగి పెద్దవి కావడంతో ఇరువర్గాలు ఆదివారం ఉదయం ఘర్షణకు దిగారు. గోవిందరెడ్డి, తిమ్మయ్య వర్గీయులు మహేశ్వర్‌రెడ్డి వర్గంపై దాడి చేశారు. ఈ దాడిలో మహేశ్వర్‌రెడ్డి, రమణారెడ్డి గాయపడడంతో కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్సకు తరలిచారు. మహేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు దుబ్బ గోవిందరెడ్డి, తిమ్మయ్యతో పాటు మొత్తం ఆరుగురిపై సంజామల పోలీసులు కేసు నమోదు చేశారు. కోవెలకుంట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టరు హనుమంతునాయక్, సంజామల ఎస్ఐ రమణయ్య, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు



గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెద్దకడుబూరు , మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులికనుమ గ్రామ పరిధిలోని ఉన్న పులికనుమ ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లివ్యక్తి గల్లంతైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలివీ.. పులికనుమ గ్రామానికి చెందిన మస్కి నాగేంద్ర శనివారం చేపలవేటకు వెళ్లారు. చేపలుపట్టేందుకు ఒడ్డుపై ఉన్న తెప్పను తిప్పి నీటిలోకి వేశారు. అయితే అది దూరంగా వెళ్లడంతో దాన్ని గట్టుకు తీసుకువచ్చేందుకు నీటిలో దిగి ఈతకొట్టుకుంటూ వెళ్లారు. కొద్దిసేపటికి కనిపించకుండ పోయేసరికి అక్కడే ఉన్న చేపలు పట్టేవారు గాలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పెద్ద కడుబూరు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి రాత్రి ఘటనా స్థలానికి వెళ్లి విచారించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో అగ్నిమాపక అధికారి రామాంజనేయులు సిబ్బందితో గాలింపు చర్యలు చేపడుతున్నారు. నాగేంద్ర కుమారుడు లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీశైలం టోల్‌గేట్ వద్ద మద్యం పట్టివేత



మద్యం, నిందితులతో పోలీసులు

శ్రీశైలం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం టోల్‌గేట్ వద్ద కర్ణాటకకు చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి మద్యం బాటిళ్లను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. కర్ణాటకకు చెందిన శివశంకర్ దారెప్ప పాటిల్ (34), ఆనంద్ ముట్వా కాంబ్లే (36) అనే ఇద్దరు వ్యక్తులు కర్ణాటక మద్యం తీసుకుని వస్తుండగా శ్రీశైలం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ జి. ప్రసాదరావు, సిబ్బంది రఘునాథుడు, శివమహేందర్ రెడ్డి, మహేష్, అమర్నాథ్‌లతో కలిసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 22 టెట్రా కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు.

ఉగాది సంబరాలకు నంద్యాల కూచిపూడి కళాక్షేత్రం ఎంపిక

నంద్యాల కల్చరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో ఈ నెల 29, 30 తేదీలలో నిర్వహిస్తున్న ఉగాది సంబరాలకు నంద్యాలకు చెందిన సాయి నాట్యాంజలి కూచిపూడి కళాక్షేత్రాన్ని ఎంపిక చేశారని నిర్వాహకులు పల్లంశెట్టి సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా తన సంస్థకు ఈ అవకాశం ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అలాగే తన వద్ద శిక్షణ తీసుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాట్యాచార్యులు సురేష్ విద్యార్థులతో సంతోషాన్ని వెలిబుచ్చారు. అనంతరం ఆంధ్రజ్యోతికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పెద్దాసుపత్రిలో శానిటేషన్ ఉద్యోగి మృతి

- మృతదేహంతో కార్మికుల ఆందోళన



కార్మికులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పారిశుధ్య కార్మికుడు నగేష్(34) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. నగరంలోని బుధవారపేటకు చెందిన నగేష్ ఏవన్ ఏజెన్సీ ఔట్‌సోర్సింగ్ కింద పని చేస్తూ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడు తున్నాడు. క్యాజువాల్టీలో మూడు రోజుల క్రితం చికిత్స తీసుకున్నాడు. ఆదివారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురై మధ్యాహ్నం 12.46 గంటలకు క్యాజువాల్టీకి వచ్చి మృతి చెందాడు. దీనిపై పారిశుధ్య కార్మికులు, బంధువులు భగ్గుమన్నారు. ఆసుపత్రి పరిపాలన విభాగం ఎదుట మృతదేహంతో పారిశుధ్య కార్మికులు ఆందోళనకు దిగారు. మృతి చెందిన కార్మికుడికి న్యాయం జరిగేంత వరకు ఇక్కడి నుంచి కదిలేదిలేదంటూ బైఠాయించారు. దీంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఘటన స్థలానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కే వెంకటేశ్వర్లు చేరుకొని కార్మికులతో మాట్లాడారు. అంత్యక్రియలకు ఆయన ఆర్థిక సాయం చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మృతదేహంతో మళ్లీ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పారిశుధ్యం కార్మికుడు రంగన్న మాట్లాడుతూ పదేళ్లుగా ఈఎస్ఐ, పీఎఫ్‌లు కాంట్రాక్టర్ కట్టడం లేదని, ఈఎస్ఐ రూ.3100 కట్టాల్సి ఉండగా.. రూ.450 కడుతున్నారన్నారు.

ఐదు నెలలుగా జీతాలు రాక, ఈఎస్ఐ కార్డు లేకపోవడంతో కార్మికుడు నాగేష్ అనారోగ్యంతో మృతి చెందాడని, అదే ఈఎస్ఐ కార్డు ఉంటే ఈఎస్ఐ హాస్పిటల్‌లో చికిత్స తీసుకునే వాడని ఆవేదన వ్యక్తం చేశారు. మృతిచెందిన కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ కట్టాలని డిమాండ్ చేశారు. తక్షణమే శానిటేషన్ కాంట్రాక్టును రద్దు చేయాలని కోరారు. చివరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతినిధిగా హెల్త్ ఇన్‌స్పెక్టర్ గోవింద స్వామి సోమవారం కాంట్రాక్టరుతో చర్చలు జరిపిస్తామని సూపరింటెండెంట్ హామీ ఇచ్చారని తెలపడంతో మృతదేహాన్ని కార్మికులు, బంధువులు మహాప్రస్థానం వాహనంలో తీసుకుపోవడంతో పరిస్థితి సద్దుమణిగింది. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు బాషా, నాగార్జున, శివ, నాగన్న, సుజాత పాల్గొన్నారు.

ఎంపీఎం రెడ్డి సేవలను భావితరాలకు తెలియజేయాలి

- అరుణభారతి అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి



మాట్లాడుతున్న అరుణభారతి అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి

కర్నూలు కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన సుప్రసిద్ధ సముద్ర శాస్త్రవేత్త డాక్టర్ ఎంపీఎం రెడ్డి చేసిన సేవలను భావితరాలకు తెలియజేయాలని బనగానపల్లెలోని అరుణభారతి సాహితీ సంస్థ అధ్యక్షుడు, సాహితీవేత్త బీసీ రాజారెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో తెలుగు కళా స్రవంతి ఆధ్వర్యంలో ఎంపీఎం రెడ్డి సంస్మరణ సభ జరిగింది. బీసీ రాజారెడ్డి, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, తెలుగు కళా స్రవంతి అధ్యక్షుడు ఇనాయతుల్లా, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, ఎంపీఎం రెడ్డి కుమారుడు డాక్టర్ మనోహర్‌రెడ్డి, కుమార్తె ఎం. మాలతిలతో కలిసి ఎంపీఎం రెడ్డి చిత్రపటానికి పుష్ప మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ నంద్యాల జిల్లా సుద్దమళ్ల గ్రామంలో పుట్టిన ఎంపీఎం రెడ్డి భారతీయ తొలి సముద్ర శాస్త్రవేత్తగా ఎదిగి కెనడా దేశంలో పరిశోధనలు చేశారని గుర్తు చేశారు. సముద్ర శాస్త్రంపై ఆయన రాసిన అనేక పుస్తకాలను నేడు ప్రపంచంలోని అన్ని దేశాల విశ్వ విద్యాలయాలు పాఠ్యాంశాలుగా బోధిస్తున్నాయని, ఇది ఈ జిల్లాకే గర్వకారణమని చెప్పారు. ప్రస్తుత సమాజంలో మానవీయ విలువలు తరిగిపోతున్నాయని, యువత లోకజ్ఞానాన్ని పొందాలని సూచించారు. సభాధ్యక్షత వహించిన పత్తి ఓబులయ్య మాట్లాడుతూ విలువలతో కూడిన జీవితాన్ని ఎంపీఎం రెడ్డి గడిపారని, ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ జీవితంలో ఎదిగేందుకు కృషి చేయాలని కోరారు. ఎంపీఎం రెడ్డి కుమార్తె ఎం. మాలతి, కుమారుడు డాక్టర్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఒక తండ్రిగా, స్నేహితుడిగా, అన్నింటికీ మించి ఒక గొప్ప గైడ్‌గా తమ జీవితాలను ఆయన చక్కగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. ఎంపీఎం రెడ్డి ఎక్కడ ఉన్నా తన చుట్టూ మంచి స్నేహితులతో ప్రేమాభిమానాలు పంచుతూ పోయారని, అందుకు ఇలాంటి సభలే నిదర్శనమని చెప్పారు. ఈ కార్యక్రమంలో గజల్ గాయకుడు మహమ్మద్ మియా ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.

విద్యతోనే విలువ: ఎంపీ బస్తిపాటి


మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సమాజంలో విద్యా ద్వారానే అన్ని పొందగలుగుతామని కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు తెలిపారు. ఆదివారం చిన్నటేకూరు డా.బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ మెడికల్ అకాడమిలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం జరిగింది. బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. ఐఐటీ మెడికల్ అకాడమిలో అత్యధిక సీట్లు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ మంచి మంచిగా ఎదగడానికి విద్య ద్వారానే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో జయ స్టీల్ సీఈవో సురేష్, జిల్లా కోఆర్డినేటర్ ఐ.శ్రీదేవి, డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప, రిటైర్డ్ పీడీ చంద్రశేఖర్, రిటైర్డు ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళలకు మార్షల్ ఆర్ట్స్ అవసరం


విద్యార్థులకు కరాటే సర్టిఫికెట్లు అందజేస్తున్న శంకర్‌శర్మ

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మహిళలకు మార్షల్ ఆర్ట్స్ కరాటే శిక్షణ ఎంతో ముఖ్యమని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్ శర్మ అన్నారు. ఆదివారం కరాటే మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలశివ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. డా.శంకర్‌శర్మ విద్యార్థులకు కరాటే బెల్టులు, సర్టిఫికెట్లు, అందజేశారు. కార్యక్రమంలో శిక్షకుడు రాఘవేంద్ర ఉన్నారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఆర్థిక సాయం

ఓర్వకల్లు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం కింద రాష్ట్రంలో అసంపూర్తిగా నిలిచిన గృహ నిర్మాణాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని హౌసింగ్ ఏఈ రామయ్య ఆదివారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిందన్నారు. ఎస్సీలకు రూ.50వేలు, బీసీలకు రూ.50వేలు ఎస్టీలకు రూ.75వేల చొప్పున అందనుందన్నారు. ప్రజలు అదనపు ఆర్థిక సాయం కోసం గ్రామ సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఏఈ హౌసింగ్ వారిని సంప్రదించాలని కోరారు.

బండలాగుడు పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వ గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో పాలబండ ఎద్దులబండ లాగుడు పోటీలను ఆదివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తనయుడు ఎన్ఎండీ ఫిరోజ్ ప్రారంభించారు. మొదటి విజేతగా నంద్యాల జిల్లా పాణ్యం మండలం వెంకట కృష్ణయ్య ఎద్దులు 4,235 అడుగుల దూరం లాగి రూ.70వేలను కైవసం చేసుకున్నాయి. రెండో విజేతగా తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూలు జిల్లా రాయవరం గ్రామానికి చెందిన అక్షర రెడ్డి ఎద్దులు 4103 అడుగుల దూరం లాగి రూ.50వేల నగదును గెలుపొందాయి. మూడో విజేతగా నంద్యాల జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి నారాయణ రెడ్డి ఎద్దులు 3895 అడుగుల దూరం లాగి రూ.40వేల నగదును గెలుపొందాయి. విజేతలకు దాతలు మాసూం, వలి, హుశేన్‌షా, టీడీపీ నాయకులు రజాక్, సామన్నగారి రామచంద్రుడు, మహ్మద్ హుశేన్, రసూల్, అబ్దుల్ రవూఫ్, నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో రజాక్, కొట్టమిద్దె వలి, హుశేన్, మాసూం, అబ్గజ్ రైతులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌ను అమలు చేయాలి

కర్నూలు న్యూసిటీ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం రజకులకు ఇస్తామన్న 200 యూనిట్లు ఉచిత విద్యుత్తును తక్షణమే అమలు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 22న కోడుమూరులో జరిగే ఆరవ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో కల్లూరు మండల కార్యదర్శి సుంకన్న, శేఖర్‌బాబు, రాముడు పాల్గొన్నారు.

క్రెడాయ్ నూతన చైర్మన్‌గా గోరంట్ల రమణ


సమావేశంలో పాల్గొన్న వ్యాపారులు

కర్నూలు అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): క్రెడాయ్ కర్నూలు చాప్టర్ రియల్ ఎస్టేట్ వ్యాపారుల, బిల్డర్ల, నూతన చైర్మన్‌గా గోరంట్ల రమణను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఆదివారం నగరంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని క్రెడాయ్ భవన్‌లో జరిగిన సమావేశానికి వంద మంది సభ్యులు హాజరయ్యారు. ఎన్నికలు రిటర్నింగ్ అధికారిగా ప్రముఖ ఆర్కిటెక్ రంగనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షులుగా సురేష్ రెడ్డి, కార్యదర్శిగా గోవర్ధన్‌రెడ్డి ఎంపికయ్యారు.

ఎండాకాలం.. మండే కాలం!

కోడుమూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి)



ఒక వైపు రికార్డు స్థాయిలో ఎండలు మండుతున్నాయి. సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ నిప్పులు కురిపిస్తున్నాడు. ఇలాంటి సమయంలో అగ్గి రాజుకుంటే బుగ్గే. ప్రజలు నిప్పు పట్ల నిర్లక్ష్యం వహిస్తే... భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే. కొన్ని సందర్భాల్లో ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం కూడా జరిగే ప్రమాదం ఉంది. ఎండా కాలంలో ఎక్కడో ఒక చోట అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దూమపాన ప్రియులు వాళ్లు ఉపయోగించిన బీడి, సిగరేట్లను ఆర్పకుండా నిర్లక్ష్యంగా పారేయడం వలన కూడా బహిరంగ ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. నిప్పు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్రం సిబ్బంది హెచ్చరికలు చేశారు. కోడుమూరు అగ్నిమాపక కేంద్రంలో 15 సిబ్బంది. ముగ్గురు హోంగార్డులు, ఒక స్టేషన్ ఫైర్ ఆఫీసర్ విధులు నిర్వహిస్తున్నారు. కోడుమూరు, సి.బెళగల్, గూడూరు ప్రాంతాల్లో గడిచిన ఏడాదిలో 56 అగ్నిప్రమాదాలు జరిగాయి. సుమారు రూ.కోటి పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు చెబుతున్నారు.



- రికార్డు స్థాయిలో ఎండలు
- మూడు మండలాలకు ఒక్క ఫైర్ స్టేషన్
- ముందు జాగ్రత్త చర్యలు తప్పనిసరి
- నిప్పు పట్ల నిర్లక్ష్యం వహిస్తే చెల్లించుకోవాలి భారీ మూల్యం



గ్యాస్ సిలిండర్ పట్ల జాగ్రత్తలు

వంట పూర్తి అయిన అనంతరం తప్పకుండా రాత్రి వేళల్లో గ్యాస్ సిలిండర్ ఉండాలంటే రెగ్యులేటర్‌ను ఆఫ్ చేసి ఉంచాలి. ముఖ్యంగా సిలిండర్‌కు ఉన్న పైపు ఐఎస్ఐ ముద్ర కల్గిన పైపును మాత్రమే వినియోగించాలి. రెండు రోజులు ఊరికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన తరువాత కిటికి, తలుపు పూర్తిగా తెరిచిన ఐదు నిమిషాల అనంతరం కరెంటు స్విచ్‌లను ఉపయోగించాలి. సిలిండర్ నుంచి గ్యాస్ లీక్ అయితే భయపకుండా దుప్పటి లేక ఏదో ఒక బట్ట సాయంతో సిలిండర్‌కు చుట్టి మంటను నివారించే ప్రయత్నం చేయాలి.





షార్ట్ సర్క్యూట్ ప్రమాదం :

కరెంటు ఓల్టేజీలో హెచ్చుతగ్గుల వలన ఇండ్లలోనే కాకుండా దుకాణం, పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎండకాలంలో ఎక్కువ కరెంటు వినియోగం వలన కూడా షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి ఇండ్లు, లేక దుకాణాల్లో తెగిపోయిన పాత వైర్లు, పాత బడిన స్విచ్‌లు, బోర్డులు ఉంటే వెంటనే వాటిని స్థానంలో కొత్తవి వేయించాలి. లేకపోతే వీటి వలన షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశాలు ఉన్నాయి.

పెట్రోల్ బంకుల దగ్గర సెల్‌ఫోన్లు వాడకూడదు

ప్రజలు ముఖ్యంగా ఎండకాలంలో పెట్రోల్ బంకుల దగ్గర మాట్లాడటం చాలా ప్రమాదకరం. వీటితో పాటు బీడీ, సిగరేట్లు పూర్తిగా నిషేధించాలి. పెట్రోల్‌బంకు యజమాన్యం ఇసుక, మంటలను అదుపు చేసే డీసీపీ వంటి అన్ని రకాల సిలిండర్లను అందుబాటులో ఉంచుకోవాలి.

తరచుగా గడ్డివాములు దగ్ధం

రైతులు ఏర్పాటు చేసుకొన్న గడ్డివాము లు తరచూ అగ్ని ప్రమాదాలకు గురవుతుంటాయి. రైతులు ముఖ్యంగా తెలుసుకోవాల్సి న విషయం ఏమిటంటే గడ్డివాముకు గడ్డివాముకు కనీసం దూరం 10 మీటర్లు ఉండాలి. ఇలా చేయడం వలన అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఒక గడ్డివాము నుంచి మరో గడ్డివాముకు మంటలు వ్యాపించకుండా నివారించవచ్చు. అలాగే కరెంటు తీగల కింద గడ్డివామును వేయకూడదు. ముఖ్యంగా పచ్చిగడ్డి, ఎండుగడ్డి కలిపి గడ్డివాము వేయకూడదు. దీని వలన ఎండ వేడికి మంటలు చెలరేగే అవకాశాలు ఉంటాయి. గడ్డిని పూర్తిగా ఎండబెట్టిన తరువాతే గడ్డివాము వేసుకోవాలి. గడ్డి వాముల దగ్గర బీడీ, సిగరేట్ల వంటి దూమపానం చేయకూడదు. పొలాల్లో పంటలు చేతికొచ్చిన తర్వాత మిగిలిన చెత్తకు రైతులు మంటలు పెట్టడం సర్వసాధారణం. కానీ మంటలు పూర్తియ్యే వరకు అక్కడే ఉండటం వలన అగ్ని ప్రమాదాలను నివారించవచ్చు.


అగ్నిమాపక సేవల శాఖ కార్యాలయం

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

కల్లూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేద మధ్య తరగతి ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో అర్హులైన లబ్ధిదారులకు రూ.12,79.292 లక్షల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

● **చిన్నారికి గౌరు చరిత అభయం:** తలసేమియా వ్యాధితో బాదపడుతున్న చిన్నారికి పాణ్యం ఎమ్మెల్యే అభయం ఇచ్చారు. పాణ్యం పట్టణానికి చెందిన మూడేళ్ల చిన్నారికి రెండు సంవత్సరాల క్రితం తలసేమియా వ్యాధి సోకింది. తల్లిదండ్రుల సమస్యను ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన గౌరు చరిత బసవతారకం క్యాన్సర్ హస్పిటల్, ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా వైద్యం అందించేలా కృషి చేస్తానన్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం అధికారులతో చర్చించి ప్రియాంకకు పింఛన్ అందేలా చర్యలు తీసుకుంటానని అభయం ఇచ్చారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు ఎస్.ఫిరోజ్, మోక్షజ్ఞ ఆర్గనైజేషన్ టీం సభ్యులు మోతిలాల్, రమేష్‌రెడ్డి, ఉదయ్, ప్రతాప్ పాల్గొన్నారు.

నగరంలో చెత్తను తొలగించండి

కర్నూలు న్యూసిటీ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): నగరంలో చెత్తను తొలగించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సీపీఐ నగర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా జొహరాపురంలో పర్యటించారు. రాజశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. ఇటీవల క్లాప్ ఆటోలను సీజ్ చేయడంతో చెత్త సేకరణ ఇబ్బందిగా మారిందన్నారు. కార్యక్రమంలో విజయ రామాంజనేయులు, మైమూద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● రవాణరంగ పరిరక్షణకై మార్చి 24న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పీఎస్.రాధాక్రిష్ణ పిలుపునిచ్చారు. కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల రవాణారంగం సంక్షేమంలో కూరుకుపోయిందన్నారు. సమావేశంలో ఆల్ ఇంఇయా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, మహ్మద్, హుస్సేన్ వల్లి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లలితాదేవి అమ్మవారి మహోత్సవం


లలితాదేవి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నగర శివారులో గుత్తిరోడ్డులోగల కేఎస్ఆర్ కన్వెన్షన్ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన లలితాదేవి అమ్మవారి మహోత్సవం వైభవంగా సాగింది. శ్రీమాతా సత్సంగ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన సుమారు వెయ్యిమంది మాతృమూర్తులు పాల్గొన్నారు. లలితాదేవి అమ్మవారికి లలితా సహస్ర నామాలతో పారాయణం, అర్చనలు చేశారు. శ్రీమాతా సంత్సంగ్ సంస్థ ప్రతినిధులు సత్యనారాయణ శర్మ, శ్రీదేవిల ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి.

గర్భధారణలో వచ్చే సమస్యలపై ప్రత్యేక దృష్టి

● గైనిక్ సొసైటీ, కిమ్స్ కడల్స్ వైద్య సదస్సు


సదస్సులో పాల్గొన్న వైద్యులు

కర్నూలు హాస్పిటల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గర్భం దాల్చినప్పుడు మహిళలకు అనేక సమస్యలు వస్తాయని, వాటిని ఎప్పటికప్పుడు వైద్యులు గమనిస్తూ తగిన చికిత్సలు అందించాలని ఫాగ్సి అధ్యక్షురాలు డా.సునీత, తందూల్వాడ్కర్ కర్నూలు ఓబీజీ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు డా.ఎస్.వెంకటరమణ, డా.వి.రాధాలక్ష్మి అన్నారు. ఆదివారం నగరంలోని కిమ్స్ కడల్స్ ఆసుపత్రి ఫెడరేషన్ ఆఫ్ అబ్స్టెట్రిక్ అండ్ గైనకాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాయలసీమ జోనల్ వైద్య విజ్ఞాన సదస్సు జరిగింది. వారు మాట్లాడుతూ గర్భిణులకు వచ్చే పచ్చకామెర్లు, గుండె సమస్యలు, హై అండ్ బీపీ మధుమేహంలను గుర్తించి చికిత్స చేసే పద్ధతులను వివరించారు. గర్భం దాల్చినప్పటి నుంచి తప్పనిసరిగా ప్రతి నెలా వైద్యుల వద్ద చూపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కన్సల్టెంట్ గైనకాలజిస్టు డా.కేపీ శిల్ప మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.నవీన్, గైనకాలజిస్టులు డా.వై.కుసుమ, డా.సుధారాణి, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డా.సందీప్ కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఖాజాహుశేన్‌దాసు ఉరుసు

కోడుమూరు రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్కూరులో వెలసిన సద్గురు ఖాజాహుశేన్‌దాసు స్వామి ఉరుసు వేడుకలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు పీఠాధిపతి ఖాజాసుభహాన్‌హుశేన్‌దాసు స్వామి తెలిపారు. ఆదివారం పీఠాధిపతి మాట్లాడుతూ వేడుకలలో భాగంగా సోమవారం గౌరవ అధ్యక్షులు సయ్యద్ మహబూబ్‌బాషా, అజ్గర్ హుశేన్ స్వాముల ఆధ్వర్యంలో గంధ వేడుకలు జరిపిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం ఉరుసు, బుధవారం కిస్తీలు జరుగుతున్నట్లు తెలిపారు.

ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు న్యూసిటీ , మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా స్థానిక నగరంలోని 8వ వార్డులోని పెద్దపడాఖానాలో మోతియా మసీదులో ఆదివారం ముస్లింలు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ విందుకు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

పాణ్యం ఎమ్మెల్యేని కలిసిన నర్సెస్ అసోసియేషన్

కర్నూలు హాస్పిటల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ గవర్నమెంటు నర్సెస్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితాను కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని జిల్లా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.లీలావతి, సి.బంగారి ఎమ్మెల్యేను కోరారు. కర్నూలు జీజీహెచ్‌లో నర్సెస్ అససియేషన్ భవనం శిథిలావస్థకు చేరిందని, దానికి మరమ్మతులు చేయించాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కర్నూలు కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రూపొందించిన త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను ఆదివారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి వేరువేరుగా జరిగిన కార్యక్రమాల్లో ఆవిష్కరించారు. మాధవనగర్‌లోని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత స్వగృహంలో ఆమె తెలుగు తొలి సంవత్సరాది ఉగాది క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక కర్నూలు, కల్లూరు కమిటీ అధ్యక్షులు నాగయ్య, పురుషోత్తం, కల్యాణి, మధువాణి, ప్రమీల, రాజేశ్వరి, గంగాధర్, నాగ సుంకన్న, శేషు, ఈశ్వరయ్య, ఓబులేసు, సుధాకర్, లత, అనిత, పద్మావతి, అక్కినరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

'విజయసాయిరెడ్డి, బాలినేని అవకాశవాద రాజకీయ నేతలు'

కర్నూలు కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అవకాశవాద రాజకీయాలకు విజయసాయిరెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రతిరూపాలని, వారు తమ స్వప్రయోజనాలకోసం ఏ పార్టీకైనా, ఏ నాయకుడికైనా వెన్నుపోటు పొడుస్తారని వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్‌చంద్రబోస్ విమర్శించారు. ఆదివారం నగరంలోని సి.క్యాంపులోని ఆయన కార్యాలయంలో బోస్ మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో వైసీపీ లోని నాయకుల్లో అన్ని విధాలా లబ్ధిపొందిన నేతలు వారేనని ఆరోపించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కూటమి ప్రభుత్వ మెప్పుకోసమే వారు వైఎస్ జగన్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

దుర్వాసనతో అన్నం తినలేకపోతున్నారు..

కర్నూలు న్యూసిటీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలోకి మురుగు నీరు చేరి దుర్వాసనతో కాలనీ ప్రజలు అన్నం తినలేకపోతున్నారని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయనతో పీపీఎస్ఎస్ ప్రతినిధి బృందం నగరంలోని బీఆర్ రెడ్డి కాలనీలో పర్యటించారు. ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిలిచి పాములు, తేళ్ళు, విషపురుగులు సంచరిస్తున్నాయని, అలాగే దోమల బెడదతో తమ పిల్లలు అనారోగ్యాలకు గురవుతున్నామని వారు చెప్పారు. ఈయన వెంట ఎం.రాజశేఖర్, కే.శ్రీను, జి.రోహిత్, పీపీఎస్ఎస్ నాయకులు ఎండీ యూనుస్, సీవీ వర్మ, షేక్ అన్వర్‌బాషా, వై.అంజి, బి.రామాంజనేయులు స్థానిక మహిళలు ఉన్నారు.

పొట్టి శ్రీరాములుకు భారతరత్న వచ్చేలా కృషి చేస్తా

● మంత్రి టీజీ భరత్


పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి టీజీ భరత్


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కమిషనర్, అధికారులు


పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్

కర్నూలు అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములకు భారత రత్న వచ్చేందకు కృషి చేస్తానని మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని చిల్డ్రన్స్ పార్కులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మంత్రి మాట్లాడుతూ తెలుగు ప్రజలంతా కలిసి ఉండాలని ప్రత్యేక రాష్ట్రం కోసం పొట్టిశ్రీరాములు ఆయన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. నేటి యువతకి పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల విన్నపాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, బీసీ వెల్ఫేరు ఆఫీసర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: ఆంధ్ర రాష్ట్రంకోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకుని నగర పాలక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి. కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, టీపీఆర్ఓ వెంకటలక్ష్మీ, ఎంఈ సత్యనారాయణ, సూపరింటెండెంట్లు సుబ్బన్న, రామక్రిష్ణ, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు క్రైం : ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివని అడిషినల్ ఎస్పీ అడ్మిన్ హుశేన్ పీరా తెలిపారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి అడిషినల్ ఎస్పీ అడ్మిన్ హుశేన్‌పీరా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు కృషి చేద్దామని అఖిల భారత బీసీ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీకంతయ్య అన్నారు. ఆదివారం నగరంలోని శశికాంత్ ప్లాజాలో ఆసంఘం కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు చంద్రకళా భాయ్, ప్రముఖ బీసీ నాయకులు శివశంకర్, చంద్రశేఖర్‌యాదవ్, వీరభద్ర, అశోక్, నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

● తెలుగు ప్రజల తేజస్సు పొట్టి శ్రీరాములు అని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దామోదరం రాధాకృష్ణ, ఓబీసీ చైర్మన్ డివీ. సాంబశివుడు, షేక్‌ఖాజా హుస్సేన్, లాజరస్, జోసెఫ్, నరసింహులు, నాగన్న, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

● నగరంలోని చిల్డ్రన్స్ పార్కులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి తెలుగుదేశం పార్టీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు వి. హనుమంతరావు చౌదరి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సాంస్కృతిక విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మి పద్మా చౌదరీ పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ప్రిన్సిపాల్ డా.ఎస్.నాగస్వామి నాయక్, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ నారాయణరావు, అధ్యాపకులు ప్రసాద్, జయశేఖర్, సోమేశ్, ఉల్లోజిరావు పాల్గొన్నారు.


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యేలు గౌరుచరిత, గిత్తా జయసూర్య


బీసీ సంఘం నాయకుల నివాళి

కల్లూరు: ఆంధ్రరాష్ట్ర సాధనకు ఆమరణ దీక్ష చేపట్టి ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పాణ్యం నందికొట్కూరు ఎమ్మెల్యేలు గౌరుచరిత, గిత్తా జయసూర్య అన్నారు. ఆదివారం స్థానిక మాధవీనగర్‌లోని గౌరు నివాసంలో పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.


ప్రారంభోత్సవానికి విచ్చేయుచున్న
విశిష్ట అతిధులకు స్వాగతం సుస్వాగతం
గౌ ॥ శ్రీ పి.వి. పార్ధసారధి గారు
శాసనసభ్యులు, ఆదోని
గౌ ॥ శ్రీ బి.టి. నాయుడు గారు
ఎమ్ఎల్సి
గౌ ॥ డా ॥ శ్రీ మధుసూదన్ గారు
ఎమ్ఎల్సి
గౌ ॥ శ్రీమతి బి. శాంత గారు
మున్సిపల్ చైర్పర్సన్
గౌ ॥ కె. మీనాక్షి నాయుడు గారు
మాజీ శాసనసభ్యులు
గౌ ॥ వై. సాయిప్రసాద్ రెడ్డి గారు
మాజీ శాసనసభ్యులు
గౌ ॥ మావూరి వెంకటరమణ గారు
సిపిఐ(ఎం) అధినేత
గౌ ॥ శ్రీ ఎస్. మల్లప్ప గారు
జనసేన ఇంచార్జ్
గౌ ॥ చందన నగేష్ ఆనంద్ గారు
చందన బ్రదర్స్, కూకట్ పల్లి
గౌ ॥ శ్రీ కృష్ణ గారు గారు
మున్సిపల్ కమిషనర్
గౌ ॥ శ్రీ ఎమ్.మౌర్య భరద్వాజ్ గారు
సబ్ కలెక్టర్
గౌ ॥ కుమారి ఎమ్. హిమలత గారు
డి ఎస్ పి
అంతులేని ఫాషన్ వైభవం
ఇప్పుడు మన ఆదోని లో.
CHANDANA SHOPPING MALL
CHANDANA SWARNA MANDIR
40 YEARS OF TRUST
40 సంవత్సరాల అనుబంధం ఇప్పుడు సరికొత్త రూపంలో
నేడే శుభారంభం
ఉదయం 10:32 ని. లకు
శారీస్
2@1099 స్కంద పట్టు శారీస్
2@499 కాటన్ శారీస్
2@499 క్రేప్ శారీస్
99 రెడీ మేడ్ బ్లౌజ్
2@1499 లెనిన్ సిల్క్ శారీస్
2@666 సౌగంధి శారీస్
99 సూరత్ శారీ
2@777 డోలా ప్రింట్ శారీస్
2@349 షిఫాన్ శారీస్
2@149 మంగళగిరి ప్రింట్ శారీస్
2@999 శిల్పకళా శారీస్
2@999 డాలర్ సిల్క్ శారీస్
2@555 శ్రీయ సూరత్ శారీస్
మెన్స్ వేర్
టి షర్టు 99
కాటన్ పాంట్స్ 2@899
జీన్స్ 2@599
కుర్తా పైజామా 2@899
లేడీస్ వేర్
లేడీస్ కుర్తి 99
లేగ్గిన్ 99
లేడీస్ టి షర్టు 99/199
పలజో సెట్ 333
ఫాన్సీ చున్ని 33/99
లాంగ్ స్కర్ట్ 179
డ్రెస్ మెటీరియల్ 3@899
కిడ్స్ వేర్
99 గర్ల్స్/బాయ్ టి షర్టు
2@799 బాయ్స్ పాంట్స్
2@499 బాయ్స్ కుర్తా పైజామా
3@499/599 గర్ల్స్ ఫ్రాక్
2@899 గర్ల్స్ ఫ్రాక్
3@499 బాయ్స్ షర్ట్స్
హోమ్
కాటన్ టర్కీ టవల్/పిల్లో 99
డోర్ కర్టెన్ 199
కాటన్ బ్లాంకెట్ /లుంగీ 99
జైపూర్ బెడ్ షీట్ 125
ప్రతి 1 గ్రాము బంగారు ఆభరణాల కొనుగోలుపై
Flat ₹ 250 తగ్గింపు
బంగారు ఆభరణాలపై
3%* నుండి తరుగు
సిల్వర్ ఆర్టికల్స్ పై
తరుగు మరియు మజూరి
లేదు*
అంతర్జాతీయ ఫ్యాషన్స్ ₹99 నుండే ప్రారంభం
CHANDANA
SHOPPING MALL
Infinite choices for every occasion
CHANDANA
SWARNA MANDIR
Infinite choices for every occasion
✦ 916 హాల్‌మార్క్ జ్యువెలరీ ✦ ఉమెన్స్‌వేర్ ✦ మెన్స్‌వేర్ ✦ కిడ్స్‌వేర్
ఏరియా హాస్పిటల్ రోడ్, ఆదోని
క్లాత్ : 08512-250916, గోల్డ్ : 08512-251916

చిర్తనకల్ రైతులకు సాగునీరు అందించండి



చిర్తనకల్ గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న నాయకులు

కోసిగి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిర్తనకల్ గ్రామ రైతులకు సాగునీరు అందించాలని సీపీఎం మండల నాయకులు రాముడు, వీరేష్‌లు కోరారు. ఆదివారం సీపీఎం ప్రజాచైతన్య యాత్రలో భాగంగా చిర్తనకల్ గ్రామంలో పర్యటించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మూగలదొడ్డి చెరువు ఉన్నా చిర్తనకల్ రైతులకు ఎలాంటి ఉపయోగం లేదని, ఈ గ్రామ రైతులు కేవలం వర్షాధారం పై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారన్నారు. అధికారులు చిర్తనకల్ గ్రామ రైతులకు సాగునీరు అందించి వలసలు నివారించాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణ పనులు చేపట్టి మండలలోని ప్రతి రైతుకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు నాగిరెడ్డి, ఆంజనేయులు, ఈరన్న లక్ష్మన్న పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

కౌతాళం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటనహల్ గ్రామంలో ఆదివారం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సర్వం కోల్పోయిన బాధితుడికి టీడీపీ మండల నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి బాధితుడితో మాట్లాడి ధైర్యం చెప్పారు. టీడీపీ రైతు విభాగం రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు అడివప్పగౌడ్, వెంకటపతిరాజు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు తమ పార్టీ మైనార్టీ గ్రామ నాయకుడు రఫీ ఇంట్లో జరిగిన విద్యుత్ ప్రమాదంతో ఆర్థికంగా నష్టపోయాడని మానవత్వంగా మండల నాయకులు కలిసి రూ.25వేలు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. బాధితుడికి అన్ని విధాలా అండగా ఉంటామని పార్టీ పరంగా ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ టిప్పుసుల్తాన్, నాయకులు ఆర్ఎంపీ డాక్టర్ రాజానందు, గ్రామ నాయకుడు దొడ్డనగౌడ్, మారెప్ప ఉన్నారు.

డెలివరీ కేసుల్లో ఎమ్మిగనూరు మొదటి స్థానం



మాట్లాడుతున్న డాక్టర్ బాలాజీ

ఎమ్మిగనూరు టౌన్,మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : డెలివరీ కేసుల్లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రి జిల్లాలో మొదటి స్థానంలో రాష్ట్రంలో పదవ స్థానంలో ఉందని డాక్టర్ బాలాజి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ 200 డెలివరి కేసులు మాత్రమే, కానీ తాము నెలకు 250 నుంచి 270 వరకు చేస్తున్నామని తెలిపారు. డెలివరి అయ్యే లక్షణాలను గమనించిన ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి చేరుకున్నట్లయితే తల్లి,బిడ్డను కాపాడగలమన్నారు. తల్లిదండ్రులు ఇంటి దగ్గర అన్ని ప్రయత్నాలు చేసి చివరి నిమిషంలో ఆసుత్రికి తీసుకురావడం వల్ల నష్టం జరుగుతుంది. ఈ విషయంపై గర్భిణులకు, కుటుంబ సభ్యులకు అవగాహన పెంచనున్నట్లు వివరించారు.

హెచ్ కైరవాడి రెవెన్యూ సహాయకుడి మృతి



మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు

గోనెగండ్ల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలం హెచ్ కైరవాడి గ్రామ రెవెన్యూ సహాయకుడు చిన్నరాముడు (58) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది రామకృష్ణ, సర్వేయర్ వెంకటేష్ లు బాధిత కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపి దహన సం స్కారాలకు ప్రభుత్వం తరుపున రూ. 25వేలు అందజేశారు. అలాగే రెవె న్యూ సహాయకుల మండల నాయకులు రూ. 5వేలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రంగన్న, రామాంజినేయులు, నబిసాబ్, దస్తగిరి, తిరుమలేష్, ఐరన్‌బండ బడేసాబ్, చిన్ననేలటూరు దాసన్న పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాముల ఆశయ సాధనకు కృషి చేయాలి

ఎమ్మిగనూరు రూరల్, మార్చి16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాలను అర్పించిన పొట్టిశ్రీరాముల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కాంగ్రెస్ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాశింవలి కోరారు. ఆదివారం స్థానిక పార్టీకార్యాలయంలో పొట్టిశ్రీరాముల జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజలు ఐక్యంగా ఉండాలని, తెలుగు భాషా గొప్పతనాన్ని అందరికి తెలిసేలా ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

40 ఏళ్లు గడిచినా రోడ్డు సౌకర్యం లేదు



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఎమ్మిగనూరు టౌన్,మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో 40 ఏళ్ళు గడిచినా రోడ్డు సౌకర్యం లేదని, వెంటనే రోడ్డు వేయించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి రాముడు, కృష్ణ మాట్లాడుతూ 1984-1985 సంవత్సరంలో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వారి పేరు మీద వందల గృహాలు కట్టించారని, అప్పుడు వేసిన రోడ్డే తప్ప ఇప్పటి వరకు వేయలేకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికి పాలకులు నాలుగుసార్లు భూమి పూజ చేసిన రోడ్డు వేయలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా కాలనీలో రోడ్ల సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బాషా, ఖాజా, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫికర్

మంత్రాలయంలో గంటల కొద్ది ట్రాఫిక్ అంతరాయం

మంత్రాలయం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో పార్కింగ్ సమస్య రోజురోజుకు సమస్య తీవ్రమవుతుంది. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని అనేక సార్లు అధికారులను కోరినా పట్టించుకునే వారే కరువయ్యారని భక్తులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. రాఘవేంద్రసర్కిల్‌లో ఆవుల గుంపు రోడ్లకు అడ్డంగా నిల్చుండడం, నిద్రిస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. అదే విధంగా సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు ప్రధాన రహదారుల్లో ఇరువైపులా కార్లను పార్కింగ్ చేయడంతో, రోడ్లపైనే పానీపూరి, టిఫిన్, పూజా సామగ్రి, తోపుడుబండ్లు పెట్టి వ్యాపారాలు సాగిస్తున్నారు. ప్రతి ఆదివారం, గురువారం సెలవు దినాల్లో ట్రాఫిక్ అధికమవుతోంది.


35 ఆటోలపై కేసులు నమోదు చేశాం

ట్రాఫిక్ నియంత్రణ కోసం అడ్డదిడ్డంగా తిప్పుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 35 ఆటోలపై కేసులు నమోదుచేశాం. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక పోలీస్ సిబ్బందిని ఏర్పాటుచేసినా రోడ్డుకిరువైలా వాహనాలు పార్కింగ్ చేయడంతో సమస్య ఎదురౌతుంది. గ్రామ పంచాయతీ, రెవెన్యూ, పోలీసు, శ్రీమఠం అధికారులతో కలిసి ట్రాఫిక్‌కు ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేపడతాం.

- శివాంజల్, ఎస్ఐ, మంత్రాలయం



రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసిన వాహనాలు



రాఘవేంద్ర సర్కిల్‌లో రోడ్డుపై నిద్రిస్తున్న గోవులు



కోసిగి బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షలకు బెంచీలను ఏర్పాటు చేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో, అధికారులు

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కోసిగి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ప్రారంభమయ్యే పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్లు కోసిగి ఎంఈవోలు మోయినుద్దీన్, శోభారాణి తెలిపారు. కోసిగిలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ప్రతి గదిలో ఫ్యాన్‌లు, లైట్లు, టేబుల్స్, తాగునీరు వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు తెలిపారు.

పరీక్షా కేంద్రాల్లో సమస్యలు లేకుండా చూస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గోనెగండ్ల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూస్తామని ఎంఈవో రామాంజినేయులు అన్నారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో ' పదవ తరగతి పరీక్షా కేంద్రాలలో తాగునీరు, బెంచీల కొరత' అన్న శీర్షిక కథనం ప్రచురితమైంది. అందుకు మండల విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఆదివారం మండలంలో ఏర్పాటు చేసిన పదవతరగతి పరీక్షా కేంద్రాలను వారు పరిశీలించారు. తాగునీరు, బెంచిలు, విద్యుత్ సమస్య, ఫ్యాన్‌లు, బస్సు సౌకర్యం వంటి అన్ని సమస్యలను పరిష్కరించినట్లు వారు తెలిపారు. మోడల్‌స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, జూనియర్ కళాశాల మూడు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

ఎమ్మిగనూరు: పదోతరగతి పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం అధికార్లు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎమ్మిగనూరు పట్టణం, మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పది చదివే 3765 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఎమ్మిగనూరు పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు మరో 15 కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో మధుసూదన్‌రాజు తెలిపారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థుల కోసం పల్లెవెలుగు బస్సులు సిద్ధం చేశామని డీఎం మద్దిలేటి నాయుడు తెలిపారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయొచ్చని, హాల్ టికెట్‌ను చూపిస్తే చాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగి చేసుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస రెడ్డి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస రెడ్డి, టీడీపీ నాయకులు

మంత్రాలయం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం మంత్రాలయం పంకజ లాడ్జీలో టీడీపీ మండల అధ్యక్షుడు పన్నగ వెంకటేష్ స్వామి ఆధ్వర్యంలో పరిమళ పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న చంద్రశేఖర్ రావు, కవిత దంపతులకు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.1,70,952 చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అమర్‌నాథరెడ్డి, సీనియర్ టీడీపీ నాయకులు విజయరామిరెడ్డి,ఎల్లారెడ్డి, చిన్న భీమా, నరసింహా, సుంకప్ప, సున్నం రామకృష్ణ, కేశన్న, యోబు, మద్రి రవి, మొండి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గొర్రెల కాపరి మృతి

గోనెగండ్ల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బైలుప్పల గ్రామానికి చెందిన జుట్ల సురేష్ (28)అనే గొర్రెల కాపరి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. శుక్రవారం రాత్రి బైలుప్పల గ్రామ శివార్లలోని దున్నపోతూ ఈరన్న పొలంలో గొర్రెలను రాత్రి నిలిపారు. దీంతో రాత్రి 9 గంటల సమయంలో పొలం నుంచి బైలుప్పలోని తన ఇంటికి వెళ్లి భోజనం చేసే వచ్చేందుకు తన ద్విచక్రవాహనం బయలు దేరాడు. మార్గమధ్యంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడటంలో తలకు తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య జుట్ల ఈరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముమ్మరంగా సాగుతున్న పుష్కరిణి నిర్మాణ పనులు



పుష్కరిణి పనులు చేస్తున్న దృశ్యం

మంత్రాలయం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో రూ. 2.80 కోట్లతో నిర్మిస్తున్న పుష్కరిణి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. బృందావనం గెస్ట్‌హౌస్ సమీపంలో 165 అడుగులపొడవు 70 అడుగుల వెడల్పు 7.5 అడుగుల లోతుతో పుష్కరిణి పనులు చేపట్టారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఎంతో ప్రతిష్టాత్మకంగా పుష్కరిణి పనులు నాణ్యత ప్రమాణాలతో భక్తులకు అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశంతో మఠం మేనేజర్, ఈఈ సురేష్ కోణాపూర్, ఏఈ బద్రినాథ్ దగ్గర ఉండి కాంట్రాక్టర్ ఓబులయ్య, సైట్ ఇంజనీర్ ఉబ్బ శ్రీనావాసులు, సూపర్‌వైజర్ హనుమంతులు పనులు చురుగ్గా చేస్తున్నారు.

కుంటనహాల్‌లో షార్ట్ సర్క్యూట్

● గాలిబూడిదైన ఇంట్లోని వస్తువులు

కౌతాళం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటనహాల్ గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. వివరాలివీ.. గ్రామానికి చెందిన రఫిక్ శనివారం తమ బంధువులను పలకరించేందుకు కర్ణాటక రాష్ట్రం సిరుగుప్పకు కుటుంబంతో కలిసి వెళ్లారు. అయితే ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇంటి పక్కల వారు ఇంట్లో నుంచి పొగలు వస్తుండటంతో ఇంటి యజమానికి సమాచారం ఇచ్చారు. తలుపులు తీసి చూడాలి ఆయన చెప్పడంతో ఇంటి పక్కల వారు తలుపులు పగలగొట్టి చూడగా ఇంటి మొత్తం దట్టమైన పొగ కమ్ముకుంది. అందులో వస్తువులన్నీ పూర్తిగా కాలి బూడిదయ్యారు. వెంటనే కరెంటు సరఫరాను నిలిపివేసి నీటితో మంటలను ఆర్పివేశారు. సమాచారం తెలుసుకున్న రఫీ హుటాహుటినా స్వగ్రామానికి చేరుకున్నారు. ఇటీవల మిరప పంటను అమ్మగా వచ్చిన నగదు రూ.1.30 లక్షలు బీరువాలో ఉంచానని, అలాగే రిఫ్రిజిరేటర్, బీరువాలో ఉన్న బట్టలతో పాటు పిల్లల చదువులకు సంబంధించిన సర్టిఫికెట్లు కాలి బూడిదయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం రూ.4 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



ప్రమాదంలో కాలిపోయిన సర్టిఫికెట్లు

రేపటి నుంచి సుయతీంద్ర తీర్థుల మహా సమారాధన

- నవ మంత్రాలయ శిల్పికి భక్తుల నీరాజనాలు


- పలువురికి అవార్డుల ప్రదానం



సుధీంద్ర తీర్థుల బృందావనానికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి పూర్వపు పీఠాధిపతి (2006 - 2014) మంత్రాలయం నవ నిర్మాణ శిల్పిగా పేరుగాంచిన సుయతీంద్ర తీర్థుల 12వ మహా సమారాధన ఉత్సవాలు 18నుంచి 20వరకు కన్నుల పండుగగా జరుగనున్నాయి. ప్రస్తుత పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులకు పీఠమిచ్చిన గురువుకు తన 12వ ఏట ప్రతిష్టాత్మకంగా ఉత్సవాలు నిర్వహించి గురుభక్తిని చాటుకోనున్నారు. 18న పూర్వారాధన, 19న మధ్యారాధన, 20న ఉత్తరరాధన నిర్వహించనున్నారు. 19న సుయతీంద్ర తీర్థులు బంగారు రథంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులు స్వామి వారి మహ సమారాధనలో పాల్గొని మొక్కులు చెల్లించి పరవశించనున్నారు. మూడు రోజులు జరిగే ఉత్సవాల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖులకు సుయతీంద్ర తీర్థుల -2025 అవార్డులను పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా పండిత విద్వాంసులచే ప్రవచనాలు, పుస్తకాల ఆవిష్కరణ, సంగీత కచేరీలు భక్తులను అలరించనున్నాయి. ఇప్పటికే మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి, ఏఈ బద్రినాథ్‌లు ఏర్పాట్లు పూర్తిచేసి సుయతీంద్ర తీర్థుల బృందావనం , యాగశాలను ముస్తాబు చేశారు.

వైభవంగా సుధీంద్ర తీర్థుల మధ్యారాధన మహోత్సవాలు



సుయతీంద్ర తీర్థులు, పూర్వపు పీఠాధితి

మంత్రాలయం రాఘవేంద్ర స్వామికి పీఠం మిచ్చిన గురువు, పూర్వపు పీఠాధిపతులు సుధీంద్ర తీర్థుల మధ్యారాధన మహోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. కర్ణాటకలోని అనగొంది సమీపంలో తుంగభద్ర నది మధ్యన నవ బృందావనంలో వెలసిన సుధీంద్ర తీర్థుల బృందావనానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం వేదపండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం నిర్వహించి బంగారు, వెండి ఆభరణాలతో పాటు, పట్టువ స్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో ద్వారపాలక అనంత స్వామి, ప్రకాష్‌ఆచార్, పవన్ ఆచర్, విజయేంద్రాచార్, ఆనందతీర్థ ఆచర్, గౌతమ్ ఆచార్, గోపాలకృష్ణస్వామి, వరదేంద్రాచార్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

● నవబృందావనం సమీపంలో వెలసిన వ్యాసరాజ మఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంజనేయస్వామి దేవాలయంలో కలశ ప్రతిష్టాపన మహ కుంభాభిషేకాన్ని మఠంపీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు, వ్యాసరాజమఠం పీఠాధిపతులు విద్యాశ్రీష తీర్థులు, సుజయనిధి తీర్థులు వైభవంగా చేశారు. ఇరువురు పీఠాధిపతులు వారి సాంప్రదాయాల ప్రకారం ఒకరినొకరు శాలువా, ఫల, పుష్పాలతో ఘనంగా సత్కరించుకున్నారు.

మంత్రాలయంలో భక్తుల కోలాహలం



రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం కోలాహలంగా మారింది. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. బుధ, గురు, శుక్ర, శని, ఆదివారం వరకు వేలాది మంది భక్తులు రావడంతో అతిథి గృహాలు, ప్రైవేట్ లాడ్జీలు భక్తులతో నిండిపోయాయి. అద్దె రూములు దొరకక మధ్వమార్గ్ కారిడార్ ముందే భక్తులు బసచేశారు. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది.

రూ.లక్ష విరాళం

రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరుకు చెందిన భానుమతి అనే భక్తురాలు రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. ఆదివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని శ్రీమఠం అభివృద్ధి కోసం రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులతో పండితులు రాఘవేంద్ర స్వామి మెమోంటో, శేష వస్త్రం, ఫల,పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

అలరించిన భరతనాట్యం

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం యాగశాలలో బెంగళూరుకు చెందిన పృథ్వి పార్థసారథి, విభ, అథితి, వసుధ అనే కళాకారులచే నిర్వహించిన భరత నాట్యం భక్తులను అలరించింది. ఆదివారం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులతో పద్మనాభ ఆచార్ ఆధ్వర్యంలో చేసిన భరతనాట్య కళా ప్రదర్శనలో భక్తులను మైమరపించింది. పాట, తాళం, తబల, సంగీతంతో నాట్యం చేస్తుండగా భక్తులు హర్షధ్వనాలు మోగించారు. కళాకారులకు పండితులు శేషవస్త్రం, ఫల,పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి సన్మానించారు. కార్యక్రమంలో మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి, మేనేజర్, ఈఈ, సురేష్ కోణాపూర్, ఏఈ బద్రినాథ్, వ్యాసరాజ ఆచార్, అనంతపురాణిక్ పాల్గొన్నారు.